ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 12 మే 2024

మరో చాన్స్ ఎందుకు ?
- ఐదేళ్ల పాలనను గుర్తు చేసుకున్న ప్రజలు
- అన్యాయాలు, అక్రమాలు, అశాంతి పాలనపై ఆగ్రహం
8

మైకుల మూగనోము..
కరెన్సీ కట్టలకు కాళ్లు !

- పార్టీల ప్రచారాలకు ఫుల్‌స్టాప్ ● బహిరంగంగానే నగదు పంపిణీ
- పోల్ మేనేజ్‌మెంట్‌పై నేతల దృష్టి

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. సుమారుగా యాభై రోజులకు పైగా సాగిన రాజకీయ పార్టీల ప్రచారాలకు శనివారం సాయంత్రం 6 గంటలతో గడువు ముగిసింది. ఇప్పటి వరకూ జెండాలు చేతబట్టి ఊరూరా తిరిగిన నాయకులు ఇక వారి ఇళ్లకే పరిమితమయ్యారు. మైకులతో హోరెత్తిం చిన ప్రచార రథాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రచారాలు ఆపేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రధాన పార్టీల అభ్యర్థులు చివరిరోజు భారీ రోడ్ షోలు, సభలు ఏర్పాటు చేశారు. తమను గెలిపించాలంటూ చివరి సారిగా ఓటర్లను అభ్యర్థించారు.

● విస్తృత తనిఖీలు

ఎన్నికల విధుల్లోని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, ఎంసీఎంసీ బృందాలు ముమ్మరంగా రోడ్లపై తిరుగుతున్నాయి. సాయంత్రం 6 తర్వాత ఎక్కడా ప్రచారం చేయ కుండా చర్యలు తీసుకున్నా యి. కొన్నిచోట్ల వీధుల్లో వివిధ పార్టీల జెండాలు కట్టి ఉండగా, వాటన్నిం టిని తొలగించారు. జిల్లాలో ఉన్న ఇతర ప్రాంతాల వారిని గుర్తించి పంపేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. హోటళ్లు, లాడ్జీలు, కల్యాణమండపాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

● జోరుగా నగదు పంపిణీ

అభ్యర్థుల భవితవ్యం తేలేందు కు మరో 24 గంటలు మాత్రమే సమయం ఉండటంతో చివరి ప్రయత్నంగా ఎవరికివారు వ్యూహా లు రచించుకుంటున్నారు. ఇప్పటి వరకూ ప్రచారంలో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. మనకు పడే ఓట్లేవి? అని లెక్కలు వేసుకుంటూనే ప్రత్యర్థి పార్టీల ఓట్లను ఎలా లాక్కోవాలి? అన్న వ్యూహాలకు పదునుపెట్టారు. అందుకు నగదునే ఆయుధంగా ఎంచుకుంటున్నారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో నగదు పంప కాలు శనివారం రాత్రికి ముగిం చారు. ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు తీసుకోవడం, అక్కడ ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు అందజేయడం వంటి పనులను క్షేత్రస్థాయి నాయకులు చేస్తున్నారు. ఒక్కో నియోజక వర్గంలో ఓటుకు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకూ పంపిణీ చేస్తున్నారు. శనివారం చాలా ప్రాంతాల్లో బహిరంగంగానే ఓటరు జాబితాలను చేతబట్టి నగదు పంపకాలు చేపట్టారు.

ఆత్మకూరు
ఉదయగిరి

ప్రజారంజక పాలన అందిస్తా

- ఆశీర్వదించి సైకిల్‌గుర్తుపై ఓటేయండి
- ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్



కలిగిరి: కాకర్ల సురేష్‌కు మంగళ హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



కలిగిరి : కాకర్ల సురేష్‌దే విజయం అంటున్న నారీమణులు

కలిగిరి, మే 11: నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా తనను, ఎంపీ గా వేమిరెడ్డిని ఆశీర్వదించి సైకిల్‌గుర్తుపై ఓటేసి గెలిపిస్తే ప్రజారంజకపాలన అందిస్తామని టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శనివారం పెద్దపాడు, పెదకొండూరు, పరికోట, సిద్దనకొండూరు, అనంతపురం గుడ్లదొనలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి మేనిఫెస్టో తయారుచేస్తే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి తాను నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేశామన్నారు. రెండేళ్లుగా ఇన్‌చార్జ్‌గా ఉన్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో గుర్తించామన్నారు. కాకర్ల ట్రస్టు ద్వారా అందించే సేవాకార్యక్రమాలకు తోడు చంద్రబాబు అండతో స్కిల్‌డెవలప్‌మెంట్ కోర్సులతో యువతకు, మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు.

ఉదయగిరి రూరల్: గంగిరెడ్డిపల్లి, మాసాయిపేట, గానుగపెంటపల్లి, వీరారెడ్డిపల్లి, వెంకట్రావుపల్లి, దుంపవారిపల్లిలో టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ భార్య కాకర్ల ప్రవీణ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి ఈవీఎం నమూనాతో ఓటు ఎలా వేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మన్నేటి వెంకటరెడ్డి, మన్నేటి లక్ష్మీ, ఓబులరెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి, వెంకటరెడ్డి, స్నేహాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక పరమటివీధిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి ఆధ్వర్యంలో నాయకులు, ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్‌బాబు, విరల రమేష్, తోట మాల్యాద్రి, వార్డు మెంబర్ తోట మనోజ్, తోట నవీన్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: ఒక్క అవకాశమని చెప్పి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు. స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. దేశంలో ఎక్కడాలేని ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తెచ్చి ప్రజల భూముల మీద హక్కులు లేకుండా కాలరాసే యత్నం చేయడం విచారకరమన్నారు. నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల సైకిల్‌గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అప్పసముద్రంకు చెందిన నెల్లూరు ప్రిన్స్ హోటల్ అధినేత చేజర్ల వెంకటరమణారెడ్డి, నేలటూరు ఎస్సీ కాలనీ ఇత్తడి ప్రసాద్, ఇత్తడి శ్రీనివాసులు వారి అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చెంచలబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలేపాటి చైతన్య, మండల కన్వీనర్ బయ్యన్న, మాబాషా, ఖాన్‌షా, అబీద్, అంబటి మస్తాన్, రమణయ్య పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మందాలనాయుడుపల్లిలో కాకర్ల సురేష్ తనయ కాకర్ల ధాత్రి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు మాలేపాటి పద్మజ, బంకా శ్రీనివాసులరెడ్డి, యర్రంరెడ్డి మాలకొండారెడ్డి, పెనల కృష్ణారెడ్డి, రామిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వింజమూరు: ఎమ్మార్పీఎస్ నాయకులు అరుంధతియవాడలో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ గెలుపుకై ప్రచారం చేపట్టారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గం కో ఆర్డినేటర్ పందిటి అంబేద్కర్ మాదిగ, మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్‌రావు మాదిగ పాల్గొన్నారు. కార్యక్రమంలో గంగపట్ల నాగరాజు, గంగపట్ల వెంగళరావుమాదిగ, గంగపట్ల రవీంద్రమాదిగ, గంగపట్ల సురేష్‌మాదిగ ఉన్నారు.

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లిలో టీడీపీ యూత్ సభ్యులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.



ఉదయగిరి రూరల్: నమూనా ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న కాకర్ల ప్రవీణ



సీతారామపురం: సూపర్‌సిక్స్ పథకాల క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

సంగం, మే 11: సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. అన్నిపోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తోపులాడుకోకుండా సెక్టోరియల్ అధికారులు భారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఉదయగిరి: నియోజకవర్గంలో సోమవారం జరగనున్న పోలింగ్‌నకు సర్వంసిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఆశీర్వదించి గెలిపిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా : ఆనం



ఆత్మకూరు: ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలు

ఆత్మకూరు, మే 11: ఈ నెల 13న జరుగనున్న పోలింగ్‌లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపిస్తే ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక రవితేజ కల్యాణ మండపంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ఉమ్మడి మేనిఫెస్టోకు ప్రజలనుంచి విశేష స్పందన లభించిందన్నారు. పదేళ్లుగా మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో చెప్పుకోదగిన ఒక్కపని చేసింటే చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ అభ్యర్థులమైన మాపైన క్రిమినల్ కేసులు ఉన్న చరిత్ర లేదన్నారు. వైసీపీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, విక్రమ్‌రెడ్డిలు ఆర్థిక నేరగాళ్లని, అలాంటి వారికి ఓటేసి మోసపోవద్దని కోరారు. టీడీపీ ప్రవేశపెట్టిన దుల్హాన్, రంజాన్ తోఫా పథకాలను వైసీపీ ఎందుకు తొలిగించారని ప్రశ్నించారు. సేవ చేస్తున్నందుకే ప్రజలకు తమపై నమ్మకం ఉందన్నారు. తాము గెలిపిస్తే ఏఎస్ఆర్ హైలెవల్ కెనాల్ పూర్తిచేసి మెట్టప్రాంత ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తామన్నారు. మెరుగైన వైద్యసేవలకు ఆత్మకూరు వైద్యశాలను 300పడకల ఆస్పత్రిగా మారుస్తామన్నారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైను పూర్తి చేస్తామన్నారు. ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్, డిగ్రీ కళా శాల, మినీ స్టేడియం అభివృద్ధి పనులు, రింగ్‌రోడ్డు ఏర్పాటు, అన్ని చెరువులకు సోమశిల జలాలు వచ్చేలా చూస్తామన్నారు. ఉత్తర, దక్షిణ కాలువలను అభివృద్ధి చేస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఎన్‌డీసీసీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆనం రంగమయూరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, మండ లాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: వైసీపీ డ్రోన్ సర్వే పేరుతో తప్పుల తడకగా భూ హద్దులు ఏర్పాటు చేసి రైతుల మధ్య విభేదాలు సృష్టించారని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఇనగలూరు, వెంగంపల్లి, ఆమనిచిరివేళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం నల్లచట్టం తెచ్చి రైతుల భూములు వారికి కాకుండా కుట్ర చేస్తున్నట్లు విమర్శించారు. వైసీపీ నాయకులు నాలుగేళ్ల భూమి మీద భూమిలోపల ఉన్న ఖనిజ సంపదను దోచేశారని, నాసిరకం మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని మండిపడ్డారు. వైసీపీని సాగనంపేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఎన్‌డీసీసీబీ మాజీ చెర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

నేను మేకపాటి ఇంటి కోడల్ని..!

- నా బిడ్డకు రావాల్సిన ఆస్తి ఇవ్వండి : శాంతకుమారి



మీడియా ఎదుట వేడుకుంటున్న శాంతకుమారి

మర్రిపాడు, మే 11: 'నేను మేకపాటి వారి ఇంటి కోడల్ని.. నా బిడ్డకు రావాల్సిన ఆస్తి ఇవ్వండి.. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి బయటవారిని ఆదరిస్తూ నాపై విషం చిమ్ముతున్నా డు'... అని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రెండో భార్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శాంతకుమారి అన్నారు. శనివారం ఆమె మర్రిపాడులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ రాజమోహన్‌రెడ్డిపై మండిపడ్డారు. 'మీ కుటుంబం కీడును నేనెప్పుడూ కోరుకోలేదు. మొదటి భార్య తుల సమ్మ వద్దకు చంద్రశేఖర్‌రెడ్డి వెళ్తుంటే... నేను అడ్డుకోలేదు.. ఎప్పుడైనా నా భర్తను తులసమ్మ వద్దకు పంపుతాను... తీసుకెళ్లండి.... కుటుంబసభ్యులు కూర్చొని మాట్లాడి నప్పుడు నా బిడ్డకు ఇస్తానన్న 35శాతం ఆస్తి వాటాను ఇవ్వకుండా, తనపై నింద లు వేస్తూ తన బిడ్డకు అన్యాయం చేశారు. తనను ఇటీవల కులం పేరుతో బాపనది అంటూ పలుమార్లు సంబోధించావు. నన్ను దుష్ట శక్తి అనటానికి కారణం ఏమి టీ?... శకుని రాజకీయాలు చేసి జీవితాన్ని నాశనం చేశావని రాజమోహన్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆత్మకూరు అభివృద్ధికి పక్కా ప్రణాళిక

ఆత్మకూరు, మే 11 : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికను రూపొందించుకుని ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తూ ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్‌కు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కావలి ఆర్వో శీనానాయక్

కావలి, మే 11: కావలి నియోజకవర్గంలోని 314 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్‌ను పోలింగ్ అధికారులు, సిబ్బందికి పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న వెక్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో పోలింగ్ పంపిణీకి చేపడుతున్న ఏర్పాట్లను కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్ శనివారం పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం ఈవీఎంలు రిసీవింగ్ చేసుకునే సిబ్బంది విధులు విధానాలపై ఆర్వో శీనానాయక్, ఏఈఆర్వో నగేష్ వెక్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. మెటీరియల్ పంపిణీ కోసం 39 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఏ కౌంటర్‌లో ఏఏ బూత్‌లు ఉన్నాయో దానిపై ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులతో కూడిన ఏర్పాట్లు చేపట్టారు. షామియానాలు వేసి కుర్చీలతో పాటు వేసవికాలం కావటంతో అక్కడ కూలర్లను కూడా ఏర్పాటు చేశారు.

ఎన్నికల మద్యంతో ఆరోగ్యానికి ముప్పు

కావలి, మే 11: సార్వత్రిక ఎన్నికల వేళ రకరకాల చీప్ లిక్కర్ మద్యం గిరిజన, దళిత కాలనీలకు చేరిందని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఆ మద్యం తాగి పేదల ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని, యానాదులను నిర్బంధించి ఓటు వేయించుకునే సంస్కృతి నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ శనివారం కావలిలో ఆర్వో శీనానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా కావలి డివిజన్‌లో ఇలాంటి మద్యం సేవించి ఆరుగురు చనిపోయారని చెప్పారు. మద్యం ఉచితంగా వస్తోందని అలవాటు లేని వారు కూడా చీప్‌లిక్కర్ తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఎన్నికల అధికారులు అలాంటి చోట పోలీస్ భద్రత పెంచి గిరిజనులు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు జరుగుమల్లి విజయరత్నం, ముక్కు మోహన్‌రావు, జడ్డా వాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం

కొండాపురం, మే 11: ఉదయగిరి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాంటూ తనయుడు మానస్ మండలంలో పలు గ్రామాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. తెలుగుయువత ఉదయగిరి నియోజకవర్గ కార్యదర్శి కొమ్మి ప్రభాకర్ ఆధ్వర్యంలో సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం నుంచి భీమవరప్పాడు పంచాయతీ మీదుగా సాయిపేట పంచాయతీలోని అన్ని గ్రామాలను కలుపుకుంటూ కొమ్ముపాలెం వరకు జరిగిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని సైకిల్ గుర్తుపై ఓటు వేసి తండ్రిని గెలిపించాలని కోరారు. గంటా నరసింహులు, కుమార్‌నాయుడు, కుంకు మోహనరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, బొల్లినేని వెంకటరమణయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

7 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం

కొండాపురం, మే 11: మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో 7 సమస్యాత్మకమైనవిగా గుర్తించామని ఎస్సై మహేంద్ర శనివారం తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి 100 మీటర్ల దూరంలో ప్రజలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ రోజున ఎవరి ఇంట్లో వారి కుటుంబసభ్యులే ఉండాలని, బయట వ్యక్తులెవ్వరైనా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, మే 11: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ, ఆలయ ప్రదక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు ఊంజలసేవా కార్యక్రమాలో జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కావలి రూరల్, మే 11: గుడ్లూరు మండలం పోటూరు, గుడ్లూరు మధ్యలో శనివారం ఆటో బోల్తాపడిన ఘటనలో కావలి పట్టణ వెంగయ్యగారిపాలెంకు చెందిన కోరా శ్రీలత(28) అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. గుడ్లూరు మండలం మాచవరంలో మిరపకాయల కోతకు వెంగయ్యగారిపాలెం నుంచి కూలీలు ఆటోలో బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త క్రాంతి కుమార్, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కోరా సంపూర్ణమ్మ తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

టీడీపీతోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి

కావలిటౌన్, మే 11 : ముదిరాజ్‌ల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని అఖిల భారత ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గూడల వెంకటాచలం ముదిరాజ్ పేర్కొన్నారు. మండల, పట్టణ ముదిరాజ్ మహాసభ నేతలతో ఆయన శనివారం పట్టణంలోని మద్దూరుపాడు, రుద్రకోట తదితర ప్రాంతాల్లో పర్యటించి టీడీపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. వారి గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ముదిరాజ్‌లతో వాగ్దానం చేయించారు. కార్యక్రమంలో కిన్నెర సుధాకర్, తిరుపతిరావు, శశి, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గాయత్రీ దీప యజ్ఞం

అల్లూరు, మే 11 : మండలంలోని సింగపేటలో వెలసియున్న అంకమ్మ ఆలయంలో అమ్మవారికి గాయత్రీ దీప యజ్ఞం నిర్వహించారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో శనివారం రాత్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారిని గెలిపించుకుందాం

దగదర్తి(బిట్రగుంట), మే 11: ప్రజాధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునే వైసీపీ నేతలను కాకుండా అభివృద్ధి చేసే టీడీపీనిగెలిపించుకోవాలని ఆ పార్టీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు అన్నారు. దగదర్తి మండలంలోని తురిమెర్ల పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యలమంచిపాడులో మాలేపాటి రవీంద్రనాయుడు ప్రచారం నిర్వహించి ఉమ్మడి అభ్యర్థులైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్టారెడ్డిలను గెలిపించాలని కోరారు. బోగోలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, కోడూరు వేంకటేశ్వర్లు రెడ్డి, పైడి హర్షలు వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వైసీపీకి ఓటేస్తే మరో ఐదేళ్లు భయపడాలి

- ప్రజల ఆస్తులు దోచుకునేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్
- ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి : టీడీపీ అభ్యర్థి కావ్య


విజయం సాధించాలని క్రిష్టారెడ్డిని ఆశీర్వదిస్తున్న ఫాస్టర్లు


కావ్య, మలిశెట్టి, అళహరిలను గజమాలతో సత్కరిస్తున్న కాపు నేతలు

కావలి, మే 11: వైసీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరించారని ఆ పార్టీకి ఓట్లేస్తే మరో ఐదేళ్ల భయపడుతూ ఉండాలని, అదే మనస్సాక్షి ప్రకారం తెలుగుదేశం పార్టీకి ఓట్లేస్తే ఐదేళ్ల ప్రశాంతంగా ఉండవచ్చని ఎన్డీఏ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య)క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణ బుడంగుంటలోని 17వ వార్డులో, పాతూరులోని 4,5,6 వార్డులలో శనివారం ఆయన స్థానిక కూటమి నేతలతో కలసి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే సొంత గడ్డ అయిన పాతూరులో టీడీపీకి విశేష స్పందన లభించింది. అనంతరం క్రిష్టారెడ్డి మాట్లాడుతూ వార్డులలోని అన్ని సమస్యలు తెలుసుకున్నాని, అందుకోసమే ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించానని, ప్రతి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధిలో నడవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. వైసీపీ తీసుకు వచ్చిన ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ మన ఆస్తులను దోచుకోవటానికేనన్నారు. కావలి ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపులేదని మరొకసారి ప్రతాప్‌రెడ్డికి అవకాశం కల్పిస్తే కావలిలో ఎవరూ ప్రశాంతంగా బ్రతికే అవకాశం ఉండదన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం కల్పిస్తే కావలిని అభివృద్ధి చేసి చూపెడతానన్నారు. ఈ కార్యక్రమాలలో జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ నేతలు కందుకూరి సత్యనారాయణ, జీ.భరత్‌కుమార్, సీవీసీ సత్యం, కే.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

కాపులకు కాపు కాస్తా

కావలి నియోజకవర్గంలో కాపులకు ఏ సమస్య రాకుండా తాను కాపు కాస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దగుమాటివెంకట(కావ్య)క్రిష్టారెడ్డి తెలిపారు. కావలి పట్టణజ ఏఎస్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో కావ్యను కాపునేతలు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కాపులను పెట్టిన ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. కాపుల ఆడపడుచులపై కూడా కేసులు పెట్టించిన ఘనుడు ప్రతాప్‌రెడ్డని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కాపు నేత మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో తనపై అనేక కేసులు పెట్టారని, తన భార్యపై కూడా కేసు పెట్టి తన బిడ్డలపై అనుచితంగా ప్రవర్తించారని కన్నీటిపర్యంతం అయ్యారు. ఈ సమావేశంలో దేవరకొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


కావ్యను గెలిపించి, కావలిని కాపాడుకుందాం

ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా దగుమాటి వెంకట(కావ్య) క్రిష్టారెడ్డిని గెలిపించుకుని కావలిని కాపాడుకుందామని పీపీబీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ జీడీడీ దివాకర్ పిలుపునిచ్చారు. స్థానిక క్రిష్టియన్ కుటుంబాలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమి అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి విజయం సాధించాలని చర్చి పాదర్లు ప్రార్థనలు చేశారు. వైసీపీ పాలనలో కావలి నియోజకవర్గంలో అరాచకాలు ఎక్కువై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో వైసీపీకి బుద్ధి చెప్పి టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. శాంతికి ప్రతిరూపం, సేవాభావం ఎక్కువగా కలిగిన వారు క్రిష్టియన్లు అని కూటమి అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మైనార్టీలకు మెరుగైన ప్రయోజనాలు సమకూరుతాయని పేర్కొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్ : వంటేరు

జలదంకి, మే 11: సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, తిరిగి ఈ రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలని టీడీపీ నేత, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ 9వ మైలు, వరదారెడ్డి గిరిజనకాలనీలో వంటేరుతో కలసి ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి ప్రవీణ శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని మే13 తరువాత కలవాలంటే బెంగళూరు వెళ్లాలన్నారు. టీడీపీ అభ్యర్థులు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవాభావం కలవారని, వీరిద్దరినీ గెలిపించుకొని చంద్రబాబును సీఎంను చేసుకుని రాష్ట్రాన్ని, జిల్లాని, ఉదయగిరిని కాపాడుకుందామని వంటేరు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వంటేరు తనయుడు వంశీ, టీడీపీ మహిళా నేత వంటేరు పద్మావతి, నాయకులు గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, స్వర్ణ కొండపనాయుడు, ఎల్.వెంకటేశ్వర్లు నాయుడు, బండి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఛాలెంజ్ ఓటు అంటే...?



ఓటర్ల జాబితాలో పేరున్నా... ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- నెల్లూరు

ఓటర్ స్లిప్పులు ఏవీ!?

- అందరికీ పంచామంటున్న అధికారులు
- ఎక్కువశాతం మందికి అందని వైనం
- సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు
- బీఎల్వోల కోసం వెతుకులాట

నెల్లూరు(హరనాథపురం), మే 11 : ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు రూపొందించిన ఓటరు సమాచార స్లిప్పులు జిల్లాలో చాలామందికి అందలేదు. అధికారులు మాత్రం జిల్లాలోని లక్షలాది మంది ఓటర్లకు అందచేశామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. జిల్లాలో 20 లక్షల మందికి పైబడి ఓటర్లు ఉన్నారు. వారందరికీ ఈ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంది. ఓటరు స్లిప్పులో ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉంది. ఏ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. పోలింగ్ బూత్ నంబరు తదితర వివరాలు ఉంటాయి. ఈ స్లిప్పులు అందచేస్తే ఓటరు సులభంగా తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది.

తూతూ మంత్రంగా పంపిణీ

కానీ స్లిప్పులు దాదాపుగా చాలామందికి అందలేదని తెలిసింది. అధికారులు కూడా ఈ స్లిప్పుల పంపిణీ విషయం గురించి పత్రికలకు సమాచారం ఇవ్వటం మానేశారు. జిల్లాలోని నియోజకవర్గాల ఆర్వోలు ఏరోజుకారోజు ఈ ఓటరు స్లిప్పుల పంపిణీ సమాచారాన్ని జిల్లా కేంద్రానికి తెలియచేయాల్సి ఉంది. పత్రికలకు సమాచారం ఇవ్వడానికి మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా ఓటరు సమాచార స్లిప్పుల వివరాలు మాత్రం అందటం లేదు. జిల్లాలోని ఎన్నికల విభాగం వారు కూడా ఈ స్లిప్పుల విషయం తెలియచేయటం లేదు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఈనెల 12వ తేదీ వరకు ఈ స్లిప్పులను పంపిణీ చేసే అవకాశం ఉంది. కానీ ఎక్కడా ఈ కార్యక్రమం వేగంగా జరగటం లేదనేది సమాచారం. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లాలోని ఓటర్లకు ఈ స్లిప్పులను పంపిణీ చేయించాలని ఓటర్లు కోరుతున్నారు.

అందుబాటులో లేని బీఎల్వోలు



ఓటర్ స్లిప్పులు బీఎల్వోల దగ్గర అందుబాటులో ఉన్నాయని, అతని నెంబరును సంప్రదించి వాటిని పొందాలని పలువురికి సెల్ ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. బీఎల్వోల నెంబరుకి ఫోన్ చేయగా, ఎవరూ ఫోన్లు తీయడం లేదు. ఒకవేళ ఫోన్ లిఫ్టు చేసినా నిర్లక్ష్యంగా సమా ధానం ఇస్తున్నారు. అంతేకాక కొంతమంది బీఎల్వోలు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. మరి కొందరు అందుబాటులో లేకుండా పోయారు. దీంతో ఓటరు స్లిప్పుల కోసం పలువురు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా వివిధ పక్షాల నాయకులు ప్రచారంలో ఇంటింటా తిరుగుతూ ఓటర్ స్లిప్పులు ఉన్నవారికే నగదు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఓటర్ స్లిప్పులకు ప్రాధాన్యత ఏర్పడింది.కాగా ఓటర్ స్లిప్పులు అందనివారు ఇంకా ఎవరైనా ఉంటే వారు కమాండ్ కంట్రోల్ రూమ్ 0861-2349402కు ఫోన్ చేసి అధికారులను సంప్రదించాలి.

ఎన్నికల సిబ్బంది మెనూ ఇదే..!



ఉదయ గిరి : ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఈనెల 12, 13వ తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. అక్కడికి చేరుకోగానే వారికి బోండా లు, గారెలతో అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ, పచ్చడి, టమోటా అలుకూర, రసం, పెరుగు, వడియాలు, అరటి పండు ఇవ్వా లి. పోలింగ్ రోజైన సోమవారం ఉదయం నాలుగు న్నర గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారెలు రెండు, చట్నీ ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు కేక్, టీ, 12.30 గటలకు వెజిటేబుల్ బిర్యానీ, పెరుగన్నం, నిమ్మదబ్బ, మూడు గంటలకు బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్ సలాడ్, ఆరు గంటలకు బోండా, గారెలు, చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికం గా తయారు చేయిం చి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది కి మెనూ ప్రకా రం భోజనం, అల్పాహారం అందించాలి.

విద్యుత్ సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్లు

నెల్లూరు (జడ్పీ) : పోలింగ్ రోజున (సోమవారం) విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా నియోజకవర్గాల పరిధిలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశామని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు సిటీ 9440817470, నెల్లూరు రూరల్ 8919987020, కావలి 7901056437, ఆత్మకూరు 9948817160, కోవూరు 9705200708, సర్వేపల్లి 8919987020, ఉదయగిరి 8341726756 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

నోట్ల కట్టల్లో తరుగు

కలిగిరి : ఓటర్లకు పంపిణీ చేసేందుకు వస్తున్న నగదు కట్టల్లో తరుగు ఉండటంతో గ్రామస్థాయి నాయకులు తల పట్టుకుంటున్నారు. కలిగిరి మండలంలో ఈ పరిస్థితే తలెత్తింది. పెద్ద తలకాయల నుంచి ప్రత్యేక ప్యాకింగ్‌లో వచ్చిన డబ్బు లెక్క విషయంలో తేడాలు వచ్చేసరికి గ్రామస్థాయి నాయకులు లబోదిబోమంటున్నారు. ఓ నాయకుడు తనకు వచ్చిన రూ.5 లక్షల ప్యాకింగ్ విప్పి లెక్కపెట్టేసరికి ప్రతి రూ.50వేల కట్టలో 3 నుంచి 4వేలు తక్కువగా వచ్చాయని వాపోయారు. మిగిలిన చోట్లా ఇదే పరిస్థితి ఉండటంతో ఏం చేయాలో అర్థంకాక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.





ఏలిక ఎన్నిక రేపే!

- అందరం ఓటు హక్కు వినియోగించుకుందాం..
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లన్నీ పూర్తి..
- విధుల్లో 14,687 మంది సిబ్బంది
- 70 శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్
- ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : ఎస్పీ

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : 'ఓటు గొప్పదనాన్ని, ఆవశ్యకతను ప్రతి పౌరుడూ గుర్తించాలి. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని బాధ్యత నెరవేర్చుకోవాలి' అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలోని మూడు మండలాలను కలుపుకొని జిల్లాలో 20,61,822 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో 14,687 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీన వీరందరినీ 638 వాహనాల్లో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుస్తామని వివరించారు. ఈ సిబ్బందికి అదనంగా రిజర్వులో మరో 2,873 మంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటుతోపాటు మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 432 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, అదనపు బలగాలతో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. కాగా శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచారాల గడువు ముగిసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఓటరు కాని వ్యక్తులు ఇక్కడ ఉండడానికి వీల్లేదని, వారంతా వెళ్లిపోవాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, నలుగురు కన్నా ఎక్కువగా గుంపుగా ఉండడానికి వీల్లేదని సూచించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు డ్రై డే పాటించాల్సి ఉటుందని, ఈ సమయంలో మద్యం దుకాణాలు, బార్లకు సీల్ వేశామని చెప్పారు. ఇక ఇప్పటి వరకూ రూ.5.53 కోట్ల విలువైన నగదు, లిక్కర్, వస్తువులు, ఆభరణాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. అందులో రూ.2.57 కోట్ల నగదు, రూ.1.75 కోట్ల విలువ చేసే 27 వేల లీటర్ల లిక్కర్ ఉన్నాయని వివరించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వస్తే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఇప్పటికి మూడు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడి మీద కానీ, మహనుభావులపై కానీ ఆధారపడవద్దు.

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్

ప్రజాస్వామ్యం అనేది సామ్యవాదానికి రహదారి

- కార్ల్‌మార్క్స్

అభ్యర్థి ఏపార్టీ వాడు కాదు... ఏ పాటివాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు.. ఇప్పటి దాకా ఏం చేశాడో చూడు..పెట్టుకునే టోపీ కాదు పెట్టిన టోపీ చూడు..

- కాళోజీ నారాయణరావు

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. ఈ హక్కు లేకపోతే సచ్ఛీలురైన పాలకులను ఎన్నుకోలేరు. యువత ఓటు విలువ తెలుసుకోకుంటే గెలిచేది రూ.కోట్లు పోసి ఓట్లుకొనే అవినీతిపరులే. అలాంటివారు చట్టసభలకు వెళ్తే సుపరిపాలన అందదు. అందుకే ఓటు వేసి మంచి నేతలను ఎన్నుకునే సువర్ణావకాశాన్ని జారవిడుచుకోవద్దు. రండి...కదలిరండి...! సోమవారం (ఈనెల 13న) జరిగే ఎన్నికల్లో ఓటు సత్తా చాటుదాం. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా నిబద్ధతతో పాలకులను ఎన్నుకుందాం..

పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు

- ర్యాంపు, చక్రాలబండి, వలంటీర్లు, చూపులేని ఓటర్ల కోసం సహాయానికి అనుమతి
- ఓటు వేయడంలో అసామర్థ్యాల వ్యక్తులకు, వయో వృద్ధులకు ప్రాధాన్యం
- ఈవీఎంలపై బ్రెయిలీ సదుపాయం
- పురుషులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు
- ఒక పురుష ఓటరు, ఇద్దరు మహిళా ఓటర్లకు పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశం
- గుర్తించిన ప్రదేశాల్లో మహిళలకు మాత్రమే పోలింగ్ కేంద్రం
- ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్‌లు
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయ బూత్
- పోలింగ్ కేంద్రంలో తాగునీరు, అత్యవసర చికిత్స సదుపాయం, మరుగుదొడ్లు
- అసామర్థ్యాలున్న వ్యక్తులకు ఉచిత రవాణా

ఓటే వజ్రాయుధం!

ఓటుహక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం(ఈసీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ-స్వీప్) విశేషంగా కృషి చేస్తోంది. ఓటుహక్కు నమోదు నుంచి మార్పు, చేర్పులు, సవరణలు, ఇతర సమస్యలపై క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నది. ఎన్నికల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లు, ఈవీఎంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

తలరాతలు మార్చే అస్త్రం

ప్రజలు మెచ్చిన నేతను ఎన్నుకునే సమయం ఆసన్నమైంది.నేతల తలరాతలు మార్చేందుకు ఓటు అనే వజ్రాయిధం మన చేతిలో ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. దీన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ఓటు వేస్తేనే ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం, పీఎంలుగా అవుతారు. అంతటి గొప్ప అవకాశం కల్పించింది మన రాజ్యాంగం. వ్యక్తుల అస్తిత్వానికి, వ్యవస్థల్లో మార్పుకు నాంది పలుకుందని ఓటు. కావున ప్రతి ఓటరూ ఈ విషయాన్ని గుర్తించి నిజాయితీగా ఓటును సద్వినియోగం చేసుకోవాలి..


హక్కు నిలబెట్టుకోండి..

రానున్న ఎన్నికల్లో మీ హక్కును నిలబెట్టుకోండి. సాధారణంగా చాలామంది తమ ఓటు లెక్కలోకి రాదులే అనుకుంటారు. మరికొందరు నేను ఒక్కడినే ఓటు వేయకుంటే ఏమవుతుందిలే.. అంటుంటారు. లేదా ఎన్నికల రోజు సెలవు కాబట్టి కుటుంబంతోనో.. స్నేహితులతోనో కాలక్షేపం చేస్తుంటారు. మరికొంతమంది సరైన అభ్యర్థి లేకపోవడం ఓటు వేయలేదని నిరాశగా చెబుతుంటారు. ఈ కారణాలన్నీ కూడా ఓటరు తమ హక్కును కోల్పోతున్నాడని తెలియచేస్తాయి. ఒక నియోజకవర్గంలో సరాసరిన 54శాతం మంది మాత్రమే ఓటు వేస్తున్నట్లు గణాంకాలు చెబుతు న్నాయి. ఇందులో గెలిచే పార్టీ 16 నుంచి 20శాతం మాత్రమే ఓట్లను పొందుతుంది. ఆ పార్టీ గెలిచే ఓట్ల శాతం 5శాతం కంటే తక్కువే ఉంటుంది. దీనివల్ల గెలిచిన అభ్యర్థికి ఓటర్లపై చులకనభావం ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కచ్చితంగా వినియోగించుకోవాలి.

తొలి పదిమందిలోనే మనం

ఓటుకు వెళ్లాలని ఉదయాన్నే నిద్రలేవాలి. పోలింగ్ బూత్‌కు వెళ్లి ముందు వరుసలో నిల్చుని హక్కును వినియోగించుకోవాలి. తొలి పది మందిలో మనమే ఉందాం...ఓటు తర్వాతే మిగిలిన పనులు చేసుకుందాం.. అనుకుం దాం... పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేలా అధికారులు చేసిన ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలి.ఓటు వేయడానికి 11 గంటల సమయం ఉంటుంది. ఉదయం ఏడు గంటల నుంచి ఓటు వేయవచ్చు. దీన్ని కూడా కాదని అవకాశం కోల్పోయి అశ్రద్ధ చేయడం, ఇతర కారణాలతో ఆఖరి నిమిషంలో వచ్చి ఓటు వేయడానికి వరుసలో నిల్చోలేని పరిస్థితులు తెచ్చుకోవద్దు.

- నెల్లూరు (విద్య)



ఓటు వేసేముందు జాగ్రత్తలు

చరవాణి సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు.. ● వరసలో నిలబడి మీ గుర్తింపు కార్డును, ఓటర్ చీటీని, సిద్ధంగా ఉంచుకోండి. ● ఓటు వేయడానికి ఈవీఎంపై మీట నొక్కండి.అనంతరం బీప్ ధ్వని వినిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరు, గుర్తుకు ఎదురుగా ఎర్రలైటు వెలుగుతుంది. ● పైన చూపించిన విధంగా ఎంపిక చేసు కున్న అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు గుర్తుకు ఎదురుగా ప్రింటర్ ఒక బ్యాలట్ స్లిప్‌ను వీవీ ప్యాట్ ముద్రిస్తుంది. యం త్రానికి చెందిన అద్దంలో నుంచి ప్రింట్ చూడండి. 7 సెకన్లు ఉంటుంది.(ప్రింట్ ఇవ్వరు).

- నేతల తలరాత మార్చే అస్త్రం
- వ్యవస్థల మార్పునకు పునాది
- యువత మేల్కొనాలి..
- హక్కు వినియోగానికి సిద్ధం కావాలి
- నిజాయతీ గల నేతను ఎన్నుకోవాలి
- రేపు పోలింగ్ బూత్‌కు తరలిరండి!

కావాల్సిన గుర్తింపు పత్రాలు


పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు(కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వరంగ సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు), ఫొటో ఉన్న బ్యాంకు లేదా తపాలా ఖాతా పాస్‌బుక్, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ ఇచ్చిన స్మార్ట్‌కార్డు, ఎంఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో ఉన్నపింఛన్ పత్రం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు.

మరో చాన్స్ ఎందుకు!?

ఐదేళ్ల పాలనను మననం చేసుకుంటున్న ప్రజలు

అన్యాయాలు, అక్రమాలు, అశాంతి పాలనపై ఆగ్రహం

కూటమి నాయకత్వంపై పెరుగుతున్న నమ్మకం



నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా స్వామ్యంలో ఓటన్నది వజ్రాయుధం. పాలకులను నిర్ణయించే బ్రహ్మాస్త్రం. ఈ పాలకుల ఎన్నిక సందర్భంగా పోటీ చేసే అభ్యర్థుల పుట్టుపూర్వోత్తరాలు, గుణగణాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ పలు చట్టాలు తీసుకొంది. అందులో భాగంగానే కేసులకు సంబంధించి అఫిడవిట్లను ప్రకటనల రూపంలో ప్రజలకు తెలియజేయాలనే నిబంధన పెట్టింది. ఈ కేసులు ఇప్పుడు ప్రజల చర్చల్లో భాగమయ్యాయి. ఆ కేసుల ఆధారంగా, గడచిన ఐదేళ్ల పాలన నడిచిన తీరు ఆధారంగా అధికార వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలా, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలా అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది.

విజయసాయిపై 21 కేసులు

ఒక్క నియోకవర్గం మినహా మిగిలిన జిల్లా అంతటా విస్తరించి ఉన్న నెల్లూరు పార్లమెంట్‌కు ఆ గట్టున ఉన్న నాయకుడు విజయసాయిరెడ్డిపై 21 కేసులు ఉన్నాయి. అందులో 11 సీబీఐ కేసులు, 8 ఈడీ కేసులు. జగన్ అక్రమాస్తులు, ఆర్థిక నేరాలు, మనీ ల్యాండరింగ్ కేసుల్లో జగన్ ఏ1 నిందితుడైతే ఈయన ఏ2 నిందితుడిగా ఉన్నారు. ఈ రోజుకూ సీబీఐ, ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. విశాఖలో భారీ ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. నెల్లూరు జిల్లా వాసి అయినా, ప్రభుత్వంలో నెం.2గా చలామణి అయినా జిల్లాకు చేసిన మేలంటూ ఏమీ లేదు. దత్తత తీసుకున్న సొంతూరికి కూడా అంతంత మాత్రంగానే సేవలందించారాయన.

● సర్వేపల్లి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ పడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 7కేసులు ఉన్నాయి. ఇందులో 2014 ఎన్నికల సమయంలో కల్తీ మద్యం సరఫరా చేసి పలువురి మరణానికి కారణమయ్యారన్న అభియోగాలపై ఈయనపై కేసు నమోదయ్యింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అభియోగాలపై మరో రెండు కేసులు ఉన్నాయి. కోర్టులో కీలక పత్రాల చోరీ కేసులో ఈయన హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులను గుల్ల చేసి మట్టి కొల్లగొట్టారని, అక్రమ తవ్వకాలతో వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌ని కొల్లగొట్టారనే అభియోగాలు ఉన్నాయి. దీనికితోడు పోలీసులను గుప్పెట పెట్టుకొని నియోజకవర్గ ప్రజలపై అక్రమ కేసులు బనాయించారని, బెదిరింపులకు, హింసకు గురిచేశారనే విమర్శలు ఉన్నాయి. కరోనా కష్టకాలంలో ప్రజల పేరు చెప్పి దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై 8 కేసులు ఉన్నాయి. అన్నీ ఆర్థిక నేరాలకు సంబంధించినవే. కేరళా జాతీయ రహదారి టోల్‌గేట్ వసూళ్లలో అవినీతికి పాల్పడ్డారని సీబీఐ కేసు నమోదు చేసింది. అలాగే ఆర్థిక అంశాలకు సంబంధించి కేరళ, ఉత్తరప్రదేశ్‌లలోనూ విక్రమ్‌పై కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

● ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై ఆర్థిక లావాదేవీలకు సంబంధించి 5 కేసులు ఉన్నాయి. ● ఇక ఐదేళ్ల పాలన విషయానికి వస్తే ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేకపోయారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించక యువతను నిర్వీర్యం చేశారు. నామ మాత్రపు అభివృద్ధి కూడా చేయలేక చేతులెత్తేశారు. ● అదే సమయంలో అటు ప్రతిపక్షాల మీద, ఇటు అమాయక ప్రజల మీద, ఇటు సహజ వనరుల మీద నిరంతర దాడి కొనసాగిందనే వాదన ఉంది. ప్రభుత్వ ప్రైవేటు భూములు కొల్లగొట్టారు. ప్రజలందరి ఆస్తి అయిన ఇసుకను దోచేశారు. పిడికెడు మట్టి దొరకనివ్వకుండా కొండలను, గుట్టలను, చెరువులను కబళించి వేశారు. క్వారీ గనులను, సిలికా మైన్లపై దురాక్రమణ చేసి స్వాధీనం చేసుకున్నారు. వందల కోట్ల సహజ వనరులను నిర్భీతిగా, నిరాటంకంగా కొల్ల గొట్టారు. అక్రమ మద్యం అమ్మకాలతో లక్షలు గడించారు. ఊరూరా గంజాయి విక్రయాలకు ఆస్కారం కలిగించారు. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా వీరికి మామూళ్లు చెల్లించని పరిస్థితి సృష్టించారు. ప్రజలపైకి పోలీసులను ఉసిగొలిపి అక్రమ కేసులు పెట్టించారు. స్వేచ్ఛగా హాయిగా జీవనం సాగించాల్సిన ప్రజలను ఐదేళ్ల పాటు భయం భయంగా బతికే వాతావరణం సృష్టించారనే అభియోగాలు వైసీపీ ఎదుర్కొం టోంది. ఇలాంటి పార్టీకి, నాయకులకు మరో చాన్స్ ఎందుకివ్వాలనే చర్చ జనంలో జోరుగా సాగుతోంది.

● గత మూడు రోజుల వ్యవధిలోనే ప్రజల ట్రెండ్ బట్టబయలవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడని నైజం, అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చూసే దృక్పథం, రౌడీయిజం, పోలీస్ జులంకు ఆస్కారమివ్వని అధినాయ కత్వం, టీడీపీ అధినేత చంద్రబాబు పాల నాదక్షతపై విశ్వాసం, జనసేనాని పవన్ కల్యాణ్ నిజాయితీపై నమ్మకం, మోది నాయతక్వ బలం మీద నమ్మ కాలపై ప్రజల విశ్వాసం పెరుగుతూ ఉంది. కూటమి గ్రాఫ్ గణనీయంగా పెరుగుతున్నట్లు కనబడుతోంది.

● కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మీద నమోదైన కేసులు ఐదే అయినా ఆయన చేయించినట్లుగా ప్రజలు భావిస్తున్న నేరాలు చాలానే ఉన్నాయి. అఫిడ విట్ ప్రకారం 2014 ఎన్నికల్లో కల్తీ మద్యం సరఫరా చేసిన కేసులో ఈయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులు ప్రస్తుతం సీఐడీ విచారణలో ఉన్నాయి. ఇక కావలిలో ప్రతి పనికి మామూళ్లు తీసుకున్న నాయకుడిగా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, మట్టి, ఇసుక తోలుకుని బతికే సన్న, చిన్న ట్రాన్స్‌పోర్టర్ల పొట్ట కొట్టారని, పేదల ఇళ్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, పోలీసులను ఉసిగొల్పి వ్యాపారులను వేధించారని, పలువురి ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

కోవూరు సర్వేపల్లి

జిల్లా అభివృద్ధే ప్రధాన ధ్యేయం : వేమిరెడ్డి



కోవూరు: రోడ్‌షోలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి



కొడవలూరు : ప్రచారంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కోవూరు, మే 11: అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామని టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. కోవూరులో శనివారం జరిగిన భారీ రోడ్‌షోలో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, కోవూరు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వైజాగ్‌లో దోచుకున్నది చాలక ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి నెల్లూరును కూడా దోచుకునేందుకు వచ్చారని దుయ్యబట్టారు. విశాఖపట్టణంలో ఏకంగా ఓ యూనివర్సిటీనే నిర్మిస్తున్న విజయసాయిరెడ్డి తమను కోటీశ్వరులని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోవూరు సహకార చక్కెర కర్మాగారంలోని సిబ్బందికి రావల్సిన బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధికి గ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబునాయుడని, ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నికైతే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

సేవా దృక్పథంతోనే పోటీ : ప్రశాంతిరెడ్డి

సేవా దృక్పథంతోనే తాను పోటీచేస్తున్నట్లు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పెన్నానది పొర్లుకట్టల్ని సైతం నాయకులు దిగమింగడంతో వరదల వల్ల కోవూరు, పడుగుపాడు ప్రాంత ప్రజానీకం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పంట కాలువల మరమ్మతులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో తాను చేసి చూపిస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకుంటే సూపర్ సిక్స్ పథకాలను అమలుపరచుకోవచ్చన్నారు. పార్లమెంటు స్థానానికి పోటీచేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. రోడ్‌షోలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచి విజయమ్మ, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బాలకృష్ణారెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, జెట్టి గోపిరెడ్డి, సుధాకర్, ధారా విజయబాబు, జానా శేషమ్మ, యేనేటి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కొడవలూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. మండలంలో తలమంచి, దామెగుంట గ్రామంలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, దివ్యాంగులకు పింఛను పెంపు అన్నివర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే తలమంచి గ్రామంలో గ్రావెల్ దోచుకున్న వారికి ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందని, ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను పట్టణాలుగా తీర్చిదిద్దుతానని, అలాగే గ్రామంలో శ్మశానాన్ని ఏర్పాటు చేస్తామని, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు జొన్న శివకుమార్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో జొన్న శివకుమార్, పి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి గెలుపు తథ్యం : ఏకొల్లు

ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు ఏకొల్లు వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో యల్లాయపాలెంలో ఆయన ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ జరి గింది. ఆయన వెంట రియాజ్‌బాషా, బడుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలకు చంద్రబాబు పెద్ద పీట

నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు పెద్దపీట వేశారని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు జొన్నా శివకుమార్ అన్నారు. మండలంలో తలమంచిలో మహిళా సంఘాలతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వైసీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఘం నాయకురాలు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

విడవలూరు: గ్రామ ఉపసర్పంచు పందిళ్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్ల బాబయ్య, విజయ్‌కుమార్, బండ్ల సుదీర్, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ బుచ్చి నగర పంచాయతీలో 20 వార్డులు, మండలంలోని సాల్మానుపురం, చెల్లాయపాళెం, విలియమ్స్‌పేట, జొన్నవాడ, పెనుబల్లి, దామరమడుగు, రేబాల, నాగమాంబాపురం, పంచేడు, మినగల్లు, కాగులపాడు, రెడ్డిపాళెం, పురంటదరపురం, నాగాయగుంట, ఇస్కపాళెం గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, మే 11 : పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు శనివారం రాత్రికే పూర్తిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులకు సూచించారు. సోమవారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం టోల్‌గేట్ ప్రాంతానికి చేరుకుని వాహన తనిఖీలను పరిశీలించి నిఘా అధికారులు, పోలీసు సిబ్బందికి పలు సూచనలిచ్చారు.



బుచ్చి డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్వో, జేసీ సేతుమాధవన్

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 11: ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 6గంటలతో ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అతిక్రమించి ప్రచారాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో ఎక్కడైనా పార్టీల గుర్తులు, జెండాలు, అభ్యర్థుల ఫోటోలు తదితర ప్రదర్శనలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒక్కసారి గెలిపిస్తే జీవితాంతం రుణపడి ఉంటా : సోమిరెడ్డి



ముత్తుకూరు : ర్యాలీలో పాల్గొన్న సోమిరెడ్డి



మనుబోలు: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ జీవో ప్రతులను చించివేస్తున్న సోమిరెడ్డి, నాయకులు

మనుబోలు, మే 11: ఒక్కసారి గెలిపిస్తే జీవితాంతం రుణపడి ఉంటానంటూ సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండల కేంద్రమైన మనుబోలులో శనివారం సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ విగ్రహం నుంచి మనుబోలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండేపల్లి కాలువ పూర్తి చేయకపోతే ఓట్లడగనన్న పెద్దమనిషి ఇప్పుడు ఏమోహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. తనని గెలిపిస్తే సర్వేపల్లికి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, చేరెడ్డి పట్టాభి రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి, అంకయ్య గౌడ్, చింతల వెంకటేశ్వర్లు, రాజాగౌడ్, ప్రసాద్, బీజేపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, జనసేన అధ్యక్షుడు పెను బాక ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటలింగ్ రద్దుచేస్తాం

అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తామని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రచారంలో భాగంగా మనుబోలులో ఆయన మండల టీడీపీ నాయకులతో కలిసి ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను జీవో ప్రతులను చించేశారు. చట్టంతో పాటు రీ సర్వేను రద్దుచేయిస్తామన్నారు.

● **ముత్తుకూరు :** సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల కోసం పోరాడుతున్న తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. జెన్‌కో కూడలి నుంచి ముత్తుకూరు వరకు శనివారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు భారీగా పాల్గొని ర్యాలీని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ అరాచకాలు అక్రమాలతో సర్వేపల్లిని సర్వనాశననం చేసిన కాకాణి నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, సోమిరెడ్డి శృతిరెడ్డి, సోమిరెడ్డి సింధురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి,జనసేననేతలు పాల్గొన్నారు.

● **పొదలకూరు :** మండలంలోని తోడేరు గ్రామంలో శనివారం సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తోడేరుల అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపును తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలోటీడీపీ గ్రామ నాయకులు అల్లి పెంచలయ్య, ప్రసాద్, గిరి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెంకటాచలం: వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో శనివారం మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన ఇస్కపాళెం మాజీ సొసైటి అధ్యక్షుడు చిట్టమూరు శేషారెడ్డితో సహా 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాకాణిని గద్దె దింపేందుకు సర్వేపల్లి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తదితరులున్నారు.

● టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సమిష్టిగా కలిసి పనిచేసి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెలగపల్లి వరప్రసాద్‌ను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

● మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ఉమ్మడి మేనిఫెస్టో, సోమిరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

విడవలూరు, మే 11: ఎన్నికలను పురస్కరించుకుని మే 13వ తేదీన పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తహసీల్దారు శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఉదయం 7నుంచి సాయంత్రం6 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. దివ్యంగుల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా పోలిస్ బందోబస్తు, సీసీకెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు.

మురళీకృష్ణకు జ్యోతిష కేసరి అవార్డు

ముత్తుకూరు, మే 11 : ముత్తుకూరుకు చెందిన జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు శనివారం జ్యోతిష కేసరి అవార్డు ప్రదానం చేశారు. పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రోసైన్సెస్ సంస్థ హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ వ్యవస్థాపకులు నాగుపల్లి మహేష్‌చంద్ర భరద్వాజ్ అందజేశారు . మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి రాంప్రసాద్, వరప్రసాద్, రాళ్లబండి సుబ్రహ్మణ్యశర్మ, జ్యోతిష ప్రముఖులు పాల్గొన్నారు.



మద్యం దుకాణానికి సీల్ వేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఎన్నికల వేళ మద్యం బంద్ !

- మధ్యాహ్నానికే మూతపడిన దుకాణాలు
- షాపుల వద్ద బారులు తీరిన మందుబాబులు
- ఒక్కొక్కరు మూడు క్వార్టర్ల కొనుగోలు ● బార్లలో భగ్గుమన్న ధరలు

నెల్లూరు(క్రైం). మే 11: సార్వత్రిక ఎన్నికల వేళ జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలకు బ్రేకులు పడ్డాయి. జిల్లా ఎక్సైజ్ అధికారి కే నాగమల్లేశ్వరరెడ్డి ఆదేశాలతో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలు, బార్లకు సీల్ వేసే పక్రియను ఎక్సైజ్ అధికారులు ప్రారంభించి 7 గంటలకు పూర్తి చేశారు. కాగా సోమవారం పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక వాటిని తెరవనున్నారు.

● దుకాణాల ఎదుట క్యూ

ఆది, సోమవారాల్లో మద్యం దుకాణాలు ఉండవని తెలుసుకున్న మందుబాబులు శనివారం ఉదయం ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరవకముందే అక్కడ బారులు తీరారు. దుకాణాలు తెరిచిన వెంటనే మద్యం కోసం పోటీపడ్డారు. రద్దీని తట్టుకోలేక సిబ్బంది పలుమార్లు దుకాణాలను మూసివేశారు. మూడు రోజులకు ఒక్కొక్కరు మూడు క్వార్టర్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. మందుబాబులు అనుకున్నట్లుగానే మధ్యాహ్నం రెండు గంటలకే జిల్లాలో దాదాపుగా అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. నిర్ధేశించిన అమ్మకాలు పూర్తయ్యాయని సిబ్బంది చెప్పడంతో మందుబాబులు గొడవకు దిగారు. మూడు గంటలు కూడా అమ్మకాలు సాగించకుండా టార్గెట్లు ఎలా పూర్తవుతాయని, బార్లకు, బ్లాక్‌కు మద్యం తరలిస్తూ మమ్మల్ని దోచుకుంటున్నారని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దుకాణాలు మూతపడగానే పల్లెల్లో బెల్ట్ దుకాణాలకు మందుబాబులు క్యూ కట్టారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని బార్లకు పరుగులు తీశారు. అయితే బార్లలో చెప్పిందే ధర అన్నట్లుగా క్వార్టర్‌పై రూ.100 నుంచి రూ.200 వరకు అదనపు భారం వేసి విక్రయాలు జరిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : జిల్లా ఎక్సైజ్ అధికారి

ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్నీ ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లను మూసివేశాం. మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యం, ఇతరులు ఎవరైనా విక్రయాలు జరిపినా, అవకతవకలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో అవకతవకలు, మద్యం అమ్మకాలు జరుగుతుంటే 0861-2331159 నెంబరుకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు.

3 బైక్‌లను ఢీకొన్న ట్రక్కు ఆటో

బుచ్చిరెడ్డిపాళెం, మే11: మండలంలోని బుచ్చి, జొన్నవాడ మార్గంలో చెల్లాయపాళెం డొంక సమీపంలోని ఇటుక బట్టీలవద్ద పందులకు వృధా అన్నం తరలించే ఓ ట్రక్కు ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న 3 బైక్‌లను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌లపై వున్న ఐదుగురు తీవ్ర గాయాలపాలుకాగా బైక్‌లు దెబ్బతిన్నాయి. వాహన చోదకులు ఆటోడ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. దీంతో కానిస్టేబుల్ ఆటోలో ఎక్కి ఆ డ్రైవర్‌తోనే ఆటోను స్టేషన్‌కు తరలించేక్రమంలో డ్రైవర్ కానిస్టేబుల్‌పై తిరగబడి ఆటోని దారి తప్పించడాన్ని జనాలు గమనించి అడ్డుకుని దేహశుద్ధి చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రసన్న వ్యాఖ్యలపై టీడీపీ నేతల మండిపాటు

బుచ్చిరెడ్డిపాళెం, మే 11 : ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి సాల్మానుపురంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద చేసిన వ్యాఖ్యలను శనివారం సాల్మానుపురం టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ సిద్దన కొండారెడ్డి, నాయకులు విలేకరుల సమావేశంతో తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ సాల్మానుపురంలో శ్మశానం గానీ, పేదలకు ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు, తాగునీరు, డ్రైన్లు, ఏ సమస్య తీర్చలేదనే మేమంతా స్వచ్ఛందంగా టీడీపీలో చేరామన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘురామిరెడ్డి, రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి, అంకిరెడ్డి, మనోహర్, పాల్గొన్నారు.

దళితులంతా టీడీపీకి అండగా నిలవాలి

నెల్లూరు(వ్యవసాయం), మే 11 : దళితులందరూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య కోరారు. దళితులారా.. మేల్కొండి అనే కరపత్రాలను శనివారం ఆయన నెల్లూరులో విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో దళితులను అడుగడుగునా ఇబ్బంది పెట్టారని రూ.4038వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. 27 దళిత పథకాలు రద్దు చేసి, వారి సంక్షేమాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకొస్తే రద్దయిన పథకాలన్నీ అమల్లోకి వస్తాయని దళితుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తారని చెప్పారు.

చేవూరు పార్థివ దేహానికి నివాళి

నెల్లూరు (వైద్యం), మే 11 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సోదరుడు చేవూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి మరణించడంతో ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. శనివారం బాలాజీనగర్‌లో ఉన్న చేవూరు నివాసంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు, ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టఫర్ తిలక్, తమిళనాడు ఇన్‌చార్జి సిరివెళ్ల ప్రసాద్, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, తిరుపతయ్య నివాళులర్పించారు.

నేడు ఆదిశంకరాచార్య జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 : శివకేశవుల అభేదాన్ని చాటుతూ అద్వైత సిద్ధాంతాన్ని బోధించిన జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి ఆదివారం. ఈ సందర్భంగా మూలస్థానేశ్వ రాలయంలో ఆదిశంకరాచార్యుల 2096వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణుగోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం గణపతి పూజ, హోమం, 9.30గంటలకు ఆదిశంకరాచార్యులకు పూజలు, 10గంటలకు వేదపారాయణం జరుగుతాయని, భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

● పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదివారం నుంచి 14వతేదీ వరకు జగద్గురువు జయంతి ఉత్సవాలు జరుగుతాయని మందిరం మేనేజర్ సీవీఎల్ నరసింహారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సౌందర్య లహరిపై ప్రవచనం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 24వతేదీ వరకు సంస్మరణ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

ప్రచారం ముగిసింది... పోలింగ్‌కు సహకరించండి

● సిటీ ఆర్వో వికాస్ మర్మత్

నెల్లూరు రూరల్, మే 11 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిందని, పోలింగ్‌కు ఒక్క రోజు గడువు మాత్రమే ఉండటంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతగా ఎన్నికలు నిర్వహించేలా అందరూ సహకరించాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్వో) వికాస్ మర్మత్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వారితో సమా వేశమయ్యారు. నూరు శాతం ఓటు నమోదుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలు ఆదివారం నాటికి పూర్తవుతాయని, ఎక్కడా లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్వో వికాస్

ధనవంతులతో పోరాడుతున్నా గెలిపించండి

● రాహుల్ ప్రధానైతే రాష్ట్రానికి ప్రత్యేక హోదా : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు

నెల్లూరు (వైద్యం), మే 11 : ఈ ఎన్నికల్లో తాను ఇద్దరు ధనవంతులతో పోరాడుతున్నానని కాంగ్రెస్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు వెల్లడించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవ చేసే వారు ఎన్నికల్లో గెలిస్తే మరింత సేవ చేస్తారన్నారు. అదే ధనవంతులు ఎన్నికల్లో గెలిస్తే వారు ఖర్చు పెట్టిన డబ్బు ఎలా రాబట్టుకోవాలో చూస్తారని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందని, అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ప్రధానిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, తనను ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

● నగరంలో భారీ ప్రదర్శన

నగరంలో కాంగ్రెస్ పార్టీ భారీ ప్రదర్శన నిర్వ హించింది. ఏటీఎం కాంపౌండ్ నుంచి సాగిన ఈ ప్రదర్శన సుందరయ్య విగ్రహం, గాంధీబొ మ్మ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సాగిం ది. ఇందులో సీపీఎం వర్గాలు కూడా పెద్ద సం ఖ్యలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రాజు మా ట్లాడుతూ నెల్లూరు ఎంపీగా తనను, సిటీ ఎమ్మె ల్యేగా సీపీఎం అభ్యర్థి మూలం రమేష్‌ను గెలి పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థు లకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం జాతీయ చైర్మన్ రాజేష్ లిలోథియా, నెల్లూరు సిటీ అభ్యర్థి మూ లం రమేష్, నెల్లూరు రూరల్ అభ్యర్థి షేక్ ఫయాజ్, కొప్పుల రాజు సతీమణి దమయంతి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో కొప్పుల రాజు, ఇండియా కూటమి అభ్యర్థులు, నేతలు

అరాచక పాలనకు

చరమగీతం పాడాలి

సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), మే 11 : రాష్ట్రంలో అరాచక పాలనకు చమరగీతం పాడేందుకు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలు తీసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ కోరారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం సాయంత్రం నగరంలో కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు, ములుముడి బస్టాండ్, చిన్నబజారు, పెద్దబజారు మీదుగా మూలాపేట సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తాను గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నెల్లూరులో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశానన్నారు. నెల్లూరును మరింత సుందరంగా తీర్చిదిద్దాలని, అగ్రస్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని చెప్పారు. సోమవారం జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి లేక ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నారాయణ, వీపీఆర్ విల్లు ఎక్కుపెట్టి ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు రూప్‌కుమార్ యాదవ్, పొంగూరు రమాదేవి, డాక్టర్ సింధూర, డాక్టర్ శరణి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో టీడీపీ అభ్యర్థులు నారాయణ, వీపీఆర్, నేతలు అజీజ్, కోటంరెడ్డి

ఉత్సాహంగా బైక్ ర్యాలీ...

నారాయణ విజయం కోరుతూ నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో శనివారం సాయంత్రం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ, సంతపేట, ములుముడి బస్టాండ్ సెంటర్, మూలాపేట, బారకాస్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి వీఆర్సీ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రజలంతా కూడా టీడీపీకి అండగా ఉండా ఎన్నికల్లో పొంగూరు నారాయణను నగర ఎమ్మెల్యేగా, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



బైక్ ర్యాలీలో విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

ప్రజల చేతుల్లో రాష్ట్ర భవిష్యత్

సైకిల్ గుర్తుకు ఓటేయండి

చివరి రోజు ప్రచారంలో రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 11 : రాష్ట్ర ప్రజల చేతుల్లో ఏపీ భవిష్యత్ ఉందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన శనివారం నగరంలోని 41వ డివిజన్ అరుంధతీపాళెంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ సహాయ, సహకారాలతో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. ఏపీ ప్రజలు కోరుకునే విధంగా అద్భుతమైన రాజధానిని అమరావతిలో నిర్మించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి తనను మూడవ సారి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. రూరల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు టీడీపీ ప్రభుత్వంలో పరిష్కారం చూపుతామన్నారు. నిత్యం నియోజవర్గ ప్రజలను కనిపెట్టుకుని వారి సమస్యల పరిష్కారం వైపు నడుస్తున్నానని చెప్పారు. కాగా, నియోజకవర్గంలోని కాకుపల్లిలో టీడీపీ నాయకులు కుడుముల నాగేశ్వర రావు గౌడ్ (కేఎస్ఆర్), కోసూరు కేశవులు, మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిని కలిశారు.



అరుంధతీపాళెం ప్రచారంలో రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి



కోటంరెడ్డిని కలిసిన కాకుపల్లి నాయకులు

టీడీపీ కూటమిని గెలిపించాలి

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 : టీడీపీ కూటమిని గెలిపించాలని శ్రీవిక్రమ సింహపురి వీధి విక్రయదారుల సంక్షేమ సేవా ట్రస్ట్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ఎస్ వెంకట రత్నం, పాశం నరసింహారావు పిలుపునిచ్చారు. నగరంలోని జర్నలిస్టు భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. నగర వ్యాప్తంగా సుమారు 5వేల మంది వీధి వ్యాపారులు ఉన్నారని తెలిపారు. వారందరికీ షాపులు కేటాయించాలని కోరారు. టీడీపీ కూటమి అభ్యర్థులైన పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చిరువ్యాపారులంతా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి రాము, ఉపాధ్యక్షుడు శరవణ, కోశాధికారి కృష్ణమూర్తి, బాలయ్య, సత్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి : సంపత్

నెల్లూరు(హరనాథపురం), మే 11 : తాను కొత్తగా ఏమీచేయకపోయినా, టీడీపీ ప్రభుత్వంలో బీసీల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కూడా రద్దు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలారని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఒట్టూరు సంపత్ యాదవ్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. కులాల పేరుతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సఖ్యతగా ఉన్న వారి మధ్య విబేధాలు సృష్టించారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు నాశనమై, తన సొంత సామాజిక వర్గమొక్కటే బాగుండటమే జగన్‌రెడ్డి లక్ష్యమని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 1200 మంది బీసీలు హత్యకు గురయ్యారని, బీసీలకు శాపంగా మారిన జగన్మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించాలని, ఎట్టి పరిస్థితుల్లో వైసీపీకి ఓటెయ్యొద్దని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘ నేత బొమ్మి నాగకిషోర్ పాల్గొన్నారు.

ప్రజల సొత్తు కాజేసేందుకే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 11 : ప్రజల సొత్తును కాజే సేందుకే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, మద్దినేని బ్రదర్స్, తానే మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కోటంరెడ్డి తదితరులు

ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి హెడ్‌ఆఫీసుకు..

నెల్లూరు(క్రైం), మే 11: సర్వేపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ఎస్‌ఐగా విధులు నిర్వహించి, ఎన్నికల కోడ్ అమలయ్యాక ఇటీవలే వీఆర్‌కు అక్కడి నుంచి ఎస్‌బీ ఎస్‌ఐగా బదిలీ అయిన శివకృష్ణారెడ్డిని గుంటూరులోని హెడ్ ఆఫీసులో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం శివకృష్ణారెడ్డి జిల్లాను విడిచి వెళ్లారని సోషల్ మీడియాలో వార్తలు రావడంతో ఎస్పీని వివరణ కోరగా పరిపాలన సౌలభ్యంలో భాగంగానే ఆ ఎస్‌ఐని హెడ్‌ఆఫీసులో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించామని తెలిపారు. కాగా, వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శివకృష్ణారెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు అండగా ఉంటారని, టీడీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంటారని టీడీపీ నాయకులు పలుమార్లు ఆరోపించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమ ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడని, తమ విషయాలను మంత్రి కాకాణికి చేరవేస్తున్నారని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో ఎస్‌ఐ శివకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. తాజాగా పోలీసు హెడ్‌ఆఫీసులో రిపోర్టు చేసుకోమని ఎన్నికలకు ముందు ఉత్తర్వులు జారీ చేయడం జిల్లాలో, ముఖ్యంగా 'సర్వేపల్లి'లో చర్చనీయాంశమైంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

● రాజకీయ పార్టీలకు ఎస్పీ విజ్ఞప్తి

నెల్లూరు(క్రైం), మే 11: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన పలు పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు తాము తీసుకుంటున్న చర్యలకు సహకారం అందించాలని కోరారు. గొడవలు, అల్లర్లు జరగకుండా సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా డయల్ 112, స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ తరఫున వెంకటేశ్వర్‌రెడ్డి, వైసీపీ నుంచి కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.




ఎన్నికల్లో అధికార పార్టీ నేతల పక్షాన దోపిడీ నిధులు వరదలా వచ్చి పడుతున్నాయి. ఐదేళ్ళుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని యధేచ్ఛగా వనరులు కొల్లగొట్టిన వైసీపీ నేతలు టోకున రూ. వేల కోట్లు పోగేసుకున్నారు. కొన్ని చోట్ల వనరుల దోపిడీకి తోడు అదనంగా వసూళ్ళు, కమిషన్లు, ఇతర దందాల ద్వారా అక్రమార్జన చేకూరింది. విచ్చలవిడిగా వచ్చిపడిన ఆ డబ్బును ఇపుడు అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో వెదజల్లుతున్నారు. ఓటుకు రూ. 2 వేల నుంచీ రూ. 3 వేలు దాకా పంపిణీ అవుతోంది. ఒక చోట నగదుకు తోడు చీరలు, ముక్కుపుల్లలు, వెండి మెట్టెలు వంటివి అందజేస్తున్నారు. మరో చోట రెండో విడత నగదు పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇసుక, సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్, మట్టి, భూములు వంటి వాటి దోపిడీ ద్వారా సమకూరిన నిధులు ఈ ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు ఆ పార్టీ నేతలు వరదలా ఖర్చు చేస్తున్న తీరు ప్రజలను నివ్వెరపరుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వరదలా పారుతున్న దోపిడీ నిధులు

ఐదేళ్ళుగా వనరులు కొల్లగొట్టిన వైసీపీ నేతలు

విచ్చలవిడిగా సంపాదించిన డబ్బును వెదజల్లుతున్న వైనం

ఓటుకు రూ 2 వేల నుంచీ రూ. 3 వేలు

కొన్ని చోట్ల రెండో విడత పంపిణీకి సన్నద్ధం

శ్రీకాళహస్తిలో కరెన్సీ నోట్ల ప్రవాహం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కరెన్సీ నోట్లను నీళ్ళలా ఖర్చు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిలో ఇసుకను ఐదేళ్ళ పాటు యధేచ్ఛగా కొల్లగొట్టేశారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు మండలాల్లో మట్టి తవ్వకాలతోనే రూ. 300 కోట్లు దోచేశారనే ఆరోపణలున్నాయి. అలాగే ఈ నాలుగు మండలాల్లో రూ. వందల కోట్ల విలువైన గ్రావెల్ తవ్వకాలు భారీగా చేపట్టారు. ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ప్రభుత్వ భూములు పెద్దఎత్తున కబ్జా అయ్యాయి. వాటి విలువా రూ. వందల కోట్లలోనే. అదే విధంగా నాలుగు మండలాల్లో పరిశ్రమల యాజమాన్యాల నుంచీ కూడా భారీగా వసూళ్ళకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఈ వనరుల దోపిడీతో భారీగా ఆర్జించినందునే వైసీపీ నేతలు ఓటర్లకు రూ. 2 వేల నుంచీ రూ. 3 వేల వంతున నగదు ఇచ్చి అదనంగా మహిళలకు బంగారు ముక్కుపుడక, వెండి మెట్టెలు, చీరలు ఇవ్వగలుగుతున్నారనే టాక్ ప్రజలనుంచీ వినిపిస్తోంది.

సూళ్ళూరుపేటలో నానా రకాల దందాలు

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో నానా రకాల దందాలు సాగించి వైసీపీ నేతలు అక్రమంగా డబ్బు పోగేసుకున్నారనే ప్రచారముంది. పెళ్ళకూరులో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో శిరసనంబేడు కొండను కరిగించేశారు. తడ మండలం మాంబట్టు వద్ద గ్రావెల్ కొల్లగొట్టారు. సూళ్ళూరుపేట మండలం మన్నారుపోలూరు వద్ద గ్రావెల్ కోసం గుట్టలాంటి మట్టి దిబ్బను మాయం చేశారు. సూళ్ళూరుపేట, నాయుడుపేట, దొరవారిసత్రం మండలాల్లో మట్టి తవ్వకాలు భారీఎత్తున సాగాయి. పెళ్ళకూరు మండలంలో ఇసుక తవ్వకాలు కోర్టు మెట్లెక్కే దాకా సాగాయి. రేషన్ బియ్యం, గుట్కా, గంజాయి వంటి అక్రమ దందాలకు అంతే లేదు. పార్టీ వర్గాల నుంచీ వచ్చిన డబ్బును ఓటర్లకు పంచుతున్న అధికార పార్టీ నేతలు ఈ అక్రమ దందాలతో వచ్చి పడిన డబ్బును ప్రచారాలకు, అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు వాడుతున్నట్టు చెబుతున్నారు.

సత్యవేడును దోచేసిన బడానేత స్వల్ప విదిలింపు

సత్యవేడు నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యే నిస్సహాయతను అడ్డం పెట్టుకుని అన్ని వనరులూ దోచేసిన అధికార పార్టీ బడా నేత ఈ ఎన్నికల్లో తన అక్రమార్జనలో స్వల్ప భాగం విదిలిస్తున్నారు. సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాలెం, నారాయణవనం, బీఎన్‌కండ్రిగ, పిచ్చాటూరు మండలాల్లో 33 గ్రావెల్ క్వారీలు నడుస్తుంటే పలు క్వారీలు పరిధికి మించి ప్రభుత్వ, అటవీ భూముల్లోనూ తవ్వకాలు జరుపుతున్నాయి.నారాయణవనం మండలం ఎరికంబట్టు గ్రామంలో గ్రావెల్ తవ్వకాలతో సగం గుట్ట కరిగిపోయింది. సత్యవేడు మండలం ఏఎం వరం, కన్నవరం, జడేరి, అల్లప్పగుంట గ్రామాల్లో కొండలన్నీ తవ్వేశారు. ఆ మండలంలోనే బాలకృష్ణాపురంలో వంద ఎకరాల పశువుల మేత భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. గ్రామస్తులు సుప్రీం కోర్టు దాకా పోరాడి ఆపగలిగారు. నాగలాపురం మండలం వజ్జావారి కండ్రిగలో గుట్ట ఖాళీ అయింది. వరదయ్యపాలెం మండలం బత్తలవల్లంలోని డీకేటీ భూముల్లో భారీగా తవ్వకాలు జరిగాయి. నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో అరుణా నదిలో భారీగా ఇసుక దోపిడీ జరిగింది. నాగలాపురం మండలం సురుటుపల్లి, నందనం గ్రామాల్లో ఇసుక తవ్వకాలను ఆపేందుకు గ్రామస్తులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్రమార్కులకు ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించింది. బీఎన్ కండ్రిగ కాళంగి నదిలో విచ్చలవిడి తవ్వకాలు జరిగాయి. సత్యవేడు మండలం పీవీపురంలో, బీఎన్ కండ్రిగ మండలాల్లో కంకర క్వారీలు అటవీ భూముల్లో కూడా తవ్వకాలు జరిగాయి. మొత్తం మీద నియోజకవర్గంలో రూ. 2-3 వేల కోట్ల దోపిడీ జరిగిందని అంచనా. ఇదంతా ఉమ్మడి జిల్లాకు చెందిన వైసీపీ బడా నేత మనుషులే చేపట్టారని, ఇపుడు ఆ అక్రమార్జనలో కొంత శాతం ఎన్నికల్లో ధారాళంగా ఖర్చు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

చంద్రగిరిలో చరిత్ర సృష్టించిన వనరుల దోపిడీ


చంద్రగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల వనరుల దోపిడీ చరిత్ర సృష్టించింది. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో స్వర్ణముఖి నదిలో భారీగా ఇసుక కొల్లగొడుతున్నారు. కేవలం ఇసుకతోనే రూ. 500 కోట్లకు పైగా దోపిడీ జరిగిందని అంచనా. రామచంద్రాపురం, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ఎర్రమట్టి తవ్వకాలు కూడా వైసీపీ నేతలకు భారీ ఆదాయాన్నిచ్చాయనే ప్రచారం వుంది. ఇక తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, మఠం భూములు కాజేశారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు శ్రీవారి దర్శనాల రూపంలో బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రవాసాంధ్రుల నుంచీ భారీగా విరాళాలు వచ్చి పడుతున్నాయనే ప్రచారముంది. ఈ నిధుల నుంచీ ఎన్నికల్లో వారు పెడుతున్న కొంత శాతం ఖర్చుకే ప్రత్యర్థులు బెంబేలెత్తిపోతున్న పరిస్థితి.

తిరుపతిలో అక్రమ నిధుల వరద

తిరుపతి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు అక్రమంగా సమకూర్చుకున్న నిదులను ఎన్నికల్లో వరదలా పారిస్తున్నారు. గత ఐదేళ్ళుగా వైసీపీ నేతలు కబ్జాలు, భూముల సెటిల్‌మెంట్లతో భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు నగరంలో వ్యాపారుల వంటి కొన్ని వర్గాల నుంచీ నిర్బంధ వసూళ్ళకు పాల్పడ్డారనే ప్రచారముంది.మున్సిపల్ కార్పొరేషన్, టీటీడీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కమీషన్ల రూపంలో కూడా రూ. వందల కోట్లు పోగేసుకున్నట్టు ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శనాల రూపంలో వస్తున్న ఆదాయానికి అంతూపొంతూ వుండడం లేదని సమాచారం. టీడీఆర్ బాండ్లలో అవినీతి విశ్వరూపం అందరికీ తెలిసిందే. ప్రభుత్వమే వాటిని నిలుపుదల చేసే స్థాయిలో అవినీతి జరిగింది. ఇలా వివిధ మార్గాల్లో పోగేసుకున్న అక్రమార్జన నుంచీ స్వల్ప శాతం నిధులనే ఎన్నికల్లో వరదలా పారిస్తున్నారు.

వెంకటగిరి, గూడూరుల్లోనూ అవే పరిస్థితులు

వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంలో ఐదేళ్ళుగా జరిగిన క్వార్ట్జ్ ఖనిజ దోపిడీతో ఆ పార్టీ నేతలు రూ. కోట్లకు పడగలెత్తారు. ఆ నిధుల్లో కొంత మేరకు ప్రస్తుత ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా ఓటుకు రూ. 3500 ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. గూడూరు విషయానికొస్తే కోట, చిల్లకూరు మండలాల్లో సిలికా దోపిడీ జరిగింది.వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఇసుక దందా భారీస్థాయిలో కొనసాగింది. గూడూరు మండలంలో గ్రావెల్, క్వార్ట్జ్ తవ్వకాలు పెద్దఎత్తున జరిగాయి. అయితే ఈ దందాలో సీఎం జగన్ సన్నిహితుల ప్రత్యక్ష ప్రమేయం వుందని సమాచారం. అభ్యర్థి కొత్తవారైనా పార్టీ వర్గాలు చేస్తున్న ఎన్నికల ఖర్చులో మాత్రం సింహభాగం ఈ అక్రమార్జన లోనిదేనన్న ఆరోపణలున్నాయి.



శ్రీవారి ఆలయం బయట భక్తులకు బాబు పలకరింపు

చిత్తూరులో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగించిన టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రి తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.వైకుంఠం క్యూకాంప్లెక్సు గుండా ఆలయానికి చేరుకున్న ఆయన మహా లఘుదర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన ప్రచారం

- గత ఎన్నికల్లో ఫ్యాన్ హోరు
- ఈసారి వైసీపీ పరిస్థితి తారుమారు
- పట్టు కోల్పోతున్నా బింకం వీడని వైసీపీ
- ప్రలోభాలు, తాయిలాలతో విజయంపై ధీమా
- జనంలో మార్పుపై కూటమి పార్టీల విశ్వాసం

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం పోలింగ్ జరగనుంది. ప్రచారం ముగియడంతో పోలింగ్ సరళి, జయాపజయాలపై అటు ప్రధాన పార్టీల్లోనూ, ఇటు ప్రజానీకంలోనూ చర్చ మొదలైంది. గత ఎన్నికల్లో జిల్లాలో ఫ్యాన్ హోరు స్పష్టంగా వినిపించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులే విజయం సాధించారు. అందరూ భారీ మెజారిటీతో గెలుపొందగా తిరుపతిలో మాత్రం అత్యల్ప మెజారిటీతో గట్టున పడ్డారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ పరిస్థితి తారుమారైనట్టు కనిపిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలోనూ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఈ ఐదేళ్ళలో ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదు.చెప్పుకోదగిన సంస్థలు రాలేదు. పరిశ్రమలూ ఏర్పాటు కాలేదు. సాగునీటి ప్రాజెక్టులు అతీగతీ లేకుండా పోయాయి. ప్రధాన రహదారులు సైతం బాగుపడలేదు. పేదలకు పక్కా ఇళ్ళు కూడా పూర్తి కాలేదు.ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి.అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయి. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి వర్గాల దైనందిన జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఇలా ప్రభుత్వ వేతనాలు అందుకునే వేలాది కుటుంబాలు అధికార పార్టీకి వ్యతిరేకంగా మారాయి. ఈ పరిణామాలకు తోడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడంతో అన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల బలం టీడీపీకి అనుకూల పరిస్థితులు కల్పిస్తోంది. సాధారణ కార్యకర్తల నుంచీ నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ పెద్దసంఖ్యలో అధికార పార్టీని వీడి టీడీపీలో చేరడం రోజువారీ కార్యక్రమంగా మారింది. దీంతో నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు ప్రజల్లోనూ, శ్రేణుల్లోనూ పట్టు కోల్పోతున్న వైనం స్పష్టంగా కళ్ళకు కడుతోంది. అయితే అభ్యర్థులు బింకం వదలడం లేదు. ఓటర్లకు నగదు పంపకాలు, ఇతర ప్రలోభాలను నమ్ముకుని విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్ల, అధికార పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతతో పాటు ఐదేళ్ళ పాటు ప్రజాక్షేత్రంలో నిలిచి పోరాడిన తమకు ఓటరు మద్దతుగా నిలుస్తాడన్న విశ్వాసం కూటమి పార్టీల్లో వ్యక్తమవుతోంది.



ఛాలెంజ్ ఓటు అంటే...?

ఓటర్ల జాబితాలో పేరున్నా... ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- నెల్లూరు

ఓటర్ స్లిప్పులు ఏవీ!?

- అందరికీ పంచామంటున్న అధికారులు
- ఎక్కువశాతం మందికి అందని వైనం
- సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు
- బీఎల్వోల కోసం వెతుకులాట

నెల్లూరు(హరనాథపురం), మే 11 : ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు రూపొందించిన ఓటరు సమాచార స్లిప్పులు జిల్లాలో చాలామందికి అందలేదు. అధికారులు మాత్రం జిల్లాలోని లక్షలాది మంది ఓటర్లకు అందచేశామని ప్రకటనలు గుప్పి స్తున్నారు. జిల్లాలో 20 లక్షల మందికి పైబడి ఓటర్లు ఉన్నారు. వారందరికీ ఈ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంది. ఓటరు స్లిప్పులో ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉంది. ఏ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించు కోవచ్చు. పోలింగ్ బూత్ నంబరు తదితర వివరాలు ఉంటాయి. ఈ స్లిప్పులు అందచేస్తే ఓటరు సులభంగా తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది.

తూతూ మంత్రంగా పంపిణీ

కానీ స్లిప్పులు దాదాపుగా చాలామందికి అందలేదని తెలిసింది. అధికారులు కూడా ఈ స్లిప్పుల పంపిణీ విషయం గురించి పత్రికలకు సమాచారం ఇవ్వటం మానేశారు. జిల్లాలోని నియోజకవర్గాల ఆర్వీలు ఏరోజుకారోజు ఈ ఓటరు స్లిప్పుల పంపిణీ సమాచారాన్ని జిల్లా కేంద్రానికి తెలియచేయాల్సి ఉంది. పత్రికలకు సమాచారం ఇవ్వడానికి మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా ఓటరు సమాచార స్లిప్పుల వివరాలు మాత్రం అందటం లేదు. జిల్లాలోని ఎన్నికల విభాగం వారు కూడా ఈ స్లిప్పుల విషయం తెలియచేయటం లేదు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఈనెల 12వ తేదీ వరకు ఈ స్లిప్పులను పంపిణీ చేసే అవకాశం ఉంది. కానీ ఎక్కడా ఈ కార్యక్రమం వేగంగా జరగటం లేదనేది సమాచారం. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లాలోని ఓటర్లకు ఈ స్లిప్పులను పంపిణీ చేయించాలని ఓటర్లు కోరుతున్నారు.

అందుబాటులో లేని బీఎల్వోలు



ఓటర్ స్లిప్పులు బీఎల్వో దగ్గర అందుబాటులో ఉన్నాయని, అతని నెంబరును సంప్రదించి వాటిని పొందాలని పలువురికి సెల్ ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. బీఎల్వోల నెంబరుకి ఫోన్ చేయగా, ఎవరూ ఫోన్లు తీయడం లేదు. ఒకవేళ ఫోన్ లిఫ్ట చేసినా నిర్లక్ష్యంగా సమా ధానం ఇస్తున్నారు. అంతేకాక కొంతమంది బీఎల్వోలు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. మరి కొందరు అందుబాటులో లేకుండా పోయారు. దీంతో ఓటరు స్లిప్పుల కోసం పలువురు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా వివిధ పక్షాల నాయకులు ప్రచారంలో ఇంటింటా తిరుగుతూ ఓటర్ స్లిప్పులు ఉన్నవారికే నగదు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఓటర్ స్లిప్పులకు ప్రాధాన్యత ఏర్పడింది.కాగా ఓటర్ స్లిప్పులు అందనివారు ఇంకా ఎవరైనా ఉంటే వారు కమాండ్ కంట్రోల్ రూమ్ 0861-2349402కు ఫోన్ చేసి అధికారులను సంప్రదించాలి.

ఎన్నికల సిబ్బంది మెనూ ఇదే..!



ఉదయ గిరి : ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఈనెల 12, 13వ తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమ కేటా యించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. అక్కడికి చేరుకోగానే వారికి బోండా లు, గారెలతో అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ, పచ్చడి, టమోటా ఆలుకూర, రసం, పెరుగు, వడియాలు, అరటి పండు ఇవ్వా లి. పోలింగ్ రోజైన సోమవారం ఉదయం నాలుగు న్నర గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారెలు రెండు, చట్నీ ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు కేక్, టీ, 12.30 గటలకు వెజిటేబుల్ బిర్యానీ, పెరుగన్నం, నిమ్మదబ్బ, మూడు గంటలకు బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్ సలాడ్, ఆరు గంటలకు బోండా, గారెలు, చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికం గా తయారు చేయిం చి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది కి మెనూ ప్రకా రం భోజనం, అల్పాహారం అందించాలి.

విద్యుత్ సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్లు

నెల్లూరు (జడ్పీ) : పోలింగ్ రోజున (సోమవారం) విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా నియోజకవర్గాల పరిధిలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశామని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు సిటీ 9440817470, నెల్లూరు రూరల్ 8919987020, కావలి 7901056437, ఆత్మకూరు 9948817160, కోవూరు 9705200708, సర్వేపల్లి 8919987020, ఉదయగిరి 8341726756 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

నోట్ల కట్టల్లో తరుగు

కలిగిరి : ఓటర్లకు పంపిణీ చేసేందుకు వస్తున్న నగదు కట్టల్లో తరుగు ఉండటంతో గ్రామస్థాయి నాయకులు తల పట్టుకుంటున్నారు. కలిగిరి మండలంలో ఈ పరిస్థితే తలెత్తింది. పెద్ద తలకాయల నుంచి ప్రత్యేక ప్యాకింగ్‌లో వచ్చిన డబ్బు లెక్క విషయంలో తేడాలు వచ్చేసరికి గ్రామస్థాయి నాయకులు లబోదిబోమంటున్నారు. ఓ నాయకుడు తనకు వచ్చిన రూ.5 లక్షల ప్యాకింగ్ విప్పి లెక్కపెట్టేసరికి ప్రతి రూ.50వేల కట్టలో 3 నుంచి 4వేలు తక్కువగా వచ్చాయని వాపోయారు. మిగిలిన చోట్లా ఇదే పరిస్థితి ఉండటంతో ఏం చేయాలో అర్థంకాక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



ఏలిక ఎన్నిక రేపే !

- అందరం ఓటు హక్కు వినియోగించుకుందాం..
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లన్నీ పూర్తి..
- విధుల్లో 14,687 మంది సిబ్బంది
- 70 శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్
- ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : ఎస్పీ

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : 'ఓటు గొప్పదనాన్ని, ఆవశ్యకతను ప్రతి పౌరుడూ గుర్తించాలి. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని బాధ్యత నెరవేర్చుకోవాలి' అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలోని మూడు మండలాలను కలుపుకొని జిల్లాలో 20,61,822 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో 14,687 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీన వీరందరినీ 638 వాహనాల్లో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుస్తామని వివరించారు. ఈ సిబ్బందికి అదనంగా రిజర్వులో మరో 2,873 మంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటుతోపాటు మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 432 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, అదనపు బలగాలతో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. కాగా శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచారాల గడువు ముగిసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఓటరు కాని వ్యక్తులు ఇక్కడ ఉండడానికి వీల్లేదని, వారంతా వెళ్లిపోవాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, నలుగురు కన్నా ఎక్కువగా గుంపుగా ఉండడానికి వీల్లేదని సూచించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు డ్రై డే పాటించాల్సి ఉటుందని, ఈ సమయంలో మద్యం దుకాణాలు, బార్లకు సీల్ వేశామని చెప్పారు. ఇక ఇప్పటి వరకూ రూ.5.53 కోట్ల విలువైన నగదు, లిక్కర్, వస్తువులు, ఆభరణాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. అందులో రూ.2.57 కోట్ల నగదు, రూ.1.75 కోట్ల విలువ చేసే 27 వేల లీటర్ల లిక్కర్ ఉన్నాయని వివరించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వస్తే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఇప్పటికి మూడు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడి మీద కానీ, మహానుభావులపై కానీ ఆధారపడవద్దు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

ప్రజాస్వామ్యం అనేది సామ్యవాదానికి రహదారి

- కార్ల్‌మార్క్స్

అభ్యర్థి ఏపార్టీ వాడు కాదు... ఏ పాటివాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు.. ఇప్పటి దాకా ఏం చేశాడో చూడు..పెట్టుకునే టోపీ కాదు పెట్టిన టోపీ చూడు..

- కాళోజీ నారాయణరావు

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. ఈ హక్కు లేకపోతే సచ్ఛీలురైన పాలకులను ఎన్నుకోలేరు. యువత ఓటు విలువ తెలుసుకోకుంటే గెలిచేది రూ.కోట్లు పోసి ఓట్లుకొనే అవినీతిపరులే. అలాంటివారు చట్టసభలకు వెళ్తే సుపరిపాలన అందదు. అందుకే ఓటు వేసి మంచి నేతలను ఎన్నుకునే సువర్ణావకాశాన్ని జారవిడుచుకోవద్దు. రండి...కదలిరండి...! సోమవారం (ఈనెల 13న) జరిగే ఎన్నికల్లో ఓటు సత్తా చాటుదాం. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా నిబద్ధతతో పాలకులను ఎన్నుకుందాం..

పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు

- ర్యాంపు, చక్రాలబండి, వలంటీర్లు, చూపులేని ఓటర్ల కోసం సహాయానికి అనుమతి
- ఓటు వేయడంలో అసామర్థ్యాల వ్యక్తులకు, వయో వృద్ధులకు ప్రాధాన్యం
- ఈవీఎంలపై బ్రెయిలీ సదుపాయం
- పురుషులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు
- ఒక పురుష ఓటరు, ఇద్దరు మహిళా ఓటర్లకు పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశం
- గుర్తించిన ప్రదేశాల్లో మహిళలకు మాత్రమే పోలింగ్ కేంద్రం
- ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్‌లు
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయ బూత్
- పోలింగ్ కేంద్రంలో తాగునీరు, అత్యవసర చికిత్స సదుపాయం, మరుగుదొడ్లు
- అసామర్థ్యాలున్న వ్యక్తులకు ఉచిత రవాణా

ఓటే వజ్రాయుధం!

- నేతల తలరాత మార్చే అస్త్రం
- వ్యవస్థల మార్పునకు పునాది
- యువత మేల్కొనాలి..
- హక్కు వినియోగానికి సిద్ధం కావాలి
- నిజాయతీ గల నేతను ఎన్నుకోవాలి
- రేపు పోలింగ్ బూత్‌కు తరలిరండి !

ఓటుహక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం(ఈసీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ-స్వీప్) విశేషంగా కృషి చేస్తోంది. ఓటుహక్కు నమోదు నుంచి మార్పు, చేర్పులు, సవరణలు, ఇతర సమస్యలపై క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నది. ఎన్నికల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లు, ఈవీఎంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

తలరాతలు మార్చే అస్త్రం

ప్రజలు మెచ్చిన నేతను ఎన్నుకునే సమయం ఆసన్నమైంది.నేతల తలరాతలు మార్చేందుకు ఓటు అనే వజ్రాయిధం మన చేతిలో ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. దీన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ఓటు వేస్తేనే ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం, పీఎంలుగా అవుతారు. అంతటి గొప్ప అవకాశం కల్పించింది మన రాజ్యాంగం. వ్యక్తుల అస్తిత్వానికి, వ్యవస్థల్లో మార్పుకు నాంది పలుకుందని ఓటు. కావున ప్రతి ఓటరూ ఈ విషయాన్ని గుర్తించి నిజాయితీగా ఓటును సద్వినియోగం చేసుకోవాలి..


హక్కు నిలబెట్టుకోండి..

రానున్న ఎన్నికల్లో మీ హక్కును నిలబెట్టుకోండి. సాధారణంగా చాలామంది తమ ఓటు లెక్కలోకి రాదులే అనుకుంటారు. మరికొందరు నేను ఒక్కడినే ఓటు వేయకుంటే ఏమవుతుందిలే.. అంటుంటారు. లేదా ఎన్నికల రోజు సెలవు కాబట్టి కుటుంబంతోనో.. స్నేహితులతోనో కాలక్షేపం చేస్తుంటారు. మరికొంతమంది సరైన అభ్యర్థి లేకపోవడం ఓటు వేయలేదని నిరాశగా చెబుతుంటారు. ఈ కారణాలన్నీ కూడా ఓటరు తమ హక్కును కోల్పోతున్నాడని తెలియచేస్తాయి. ఒక నియోజకవర్గంలో సరాసరిన 54శాతం మంది మాత్రమే ఓటు వేస్తున్నట్లు గణాంకాలు చెబుతు న్నాయి. ఇందులో గెలిచే పార్టీ 16 నుంచి 20శాతం మాత్రమే ఓట్లను పొందుతుంది. ఆ పార్టీ గెలిచే ఓట్ల శాతం 5శాతం కంటే తక్కువే ఉంటుంది. దీనివల్ల గెలిచిన అభ్యర్థికి ఓటర్లపై చులకనభావం ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కచ్చితంగా వినియోగించుకోవాలి.

తొలి పదిమందిలోనే మనం

ఓటుకు వెళ్లాలని ఉదయాన్నే నిద్రలేవాలి. పోలింగ్ బూత్‌కు వెళ్లి ముందు వరుసలో నిల్చుని హక్కును వినియోగించుకోవాలి. తొలి పది మందిలో మనమే ఉందాం...ఓటు తర్వాతే మిగిలిన పనులు చేసుకుందాం.. అనుకుందాం... పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేలా అధికారులు చేసిన ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలి.ఓటు వేయడానికి 11 గంటల సమయం ఉంటుంది. ఉదయం ఏడు గంటల నుంచి ఓటు వేయవచ్చు. దీన్ని కూడా కాదని అవకాశం కోల్పోయి అశ్రద్ధ చేయడం, ఇతర కారణాలతో ఆఖరి నిమిషంలో వచ్చి ఓటు వేయడానికి వరుసలో నిల్చోలేని పరిస్థితులు తెచ్చుకోవద్దు.

- నెల్లూరు (విద్య)



ఓటు వేసేముందు జాగ్రత్తలు


చరవాణి సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు.. ● వరసలో నిలబడి మీ గుర్తింపు కార్డును, ఓటర్ చీటీని, సిద్ధంగా ఉంచుకోండి. ● ఓటు వేయడానికి ఈవీఎంపై మీట నొక్కండి.అనంతరం బీప్ ధ్వని వినిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరు, గుర్తుకు ఎదురుగా ఎర్రలైటు వెలుగుతుంది. ● పైన చూపించిన విధంగా ఎంపిక చేసు కున్న అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు గుర్తుకు ఎదురుగా ప్రింటర్ ఒక బ్యాలట్ స్లిప్‌ను వీవీ ప్యాట్ ముద్రిస్తుంది. యం త్రానికి చెందిన అద్దంలో నుంచి ప్రింట్ చూడండి. 7 సెకన్లు ఉంటుంది.(ప్రింట్ ఇవ్వరు).

కావాల్సిన గుర్తింపు పత్రాలు

పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు(కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వరంగ సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు), ఫొటో ఉన్న బ్యాంకు లేదా తపాలా ఖాతా పాస్‌బుక్, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ ఇచ్చిన స్మార్ట్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో ఉన్నపింఛన్ పత్రం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు.

మరో చాన్స్ ఎందుకు!?

- ఐదేళ్ల పాలనను మననం చేసుకుంటున్న ప్రజలు
- అన్యాయాలు, అక్రమాలు, అశాంతి పాలనపై ఆగ్రహం
- కూటమి నాయకత్వంపై పెరుగుతున్న నమ్మకం




నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా స్వామ్యంలో ఓటన్నది వజ్రాయుధం. పాలకులను నిర్ణయంచే బ్రహ్మాస్త్రం. ఈ పాలకుల ఎన్నిక సందర్భంగా పోటీ చేసే అభ్యర్థుల పుట్టుపూర్వోత్తరాలు, గుణగణాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ పలు చట్టాలు తీసుకొంది. అందులో భాగంగానే కేసులకు సంబంధించి అఫిడవిట్లను ప్రకటనల రూపంలో ప్రజలకు తెలియజేయాలనే నిబంధన పెట్టింది. ఈ కేసులు ఇప్పుడు ప్రజల చర్చల్లో భాగమయ్యాయి. ఆ కేసుల ఆధారంగా, గడచిన ఐదేళ్ల పాలన నడిచిన తీరు ఆధారంగా అధికార వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలా, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలా అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది.

విజయసాయిపై 21 కేసులు

ఒక్క నియోకవర్గం మినహా మిగిలిన జిల్లా అంతటా విస్తరించి ఉన్న నెల్లూరు పార్లమెంట్‌కు ఆ గట్టున ఉన్న నాయకుడు విజయసాయిరెడ్డిపై 21 కేసులు ఉన్నాయి. అందులో 11 సీబీఐ కేసులు, 8 ఈడీ కేసులు. జగన్ అక్రమాస్తులు, ఆర్థిక నేరాలు, మనీ ల్యాండరింగ్ కేసుల్లో జగన్ ఏ1 నిందితుడైతే ఈయన ఏ2 నిందితుడిగా ఉన్నారు. ఈ రోజుకూ సీబీఐ, ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. విశాఖలో భారీ ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. నెల్లూరు జిల్లా వాసి అయినా, ప్రభుత్వంలో నెం.2గా చలామణి అయినా జిల్లాకు చేసిన మేలంటూ ఏమీ లేదు. దత్తత తీసుకున్న సొంతూరికి కూడా అంతంత మాత్రంగానే సేవలందించారాయన.

- సర్వేపల్లి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ పడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 7కేసులు ఉన్నాయి. ఇందులో 2014 ఎన్నికల సమయంలో కల్తీ మద్యం సరఫరా చేసి పలువురి మరణానికి కారణమయ్యారన్న అభియోగాలపై ఈయనపై కేసు నమోదయ్యింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అభియోగాలపై మరో రెండు కేసులు ఉన్నాయి. కోర్టులో కీలక పత్రాల చోరీ కేసులో ఈయన హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులను గుల్ల చేసి మట్టి కొల్లగొట్టారని, అక్రమ తవ్వకాలతో వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌ని కొల్లగొట్టారనే అభియోగాలు ఉన్నాయి. దీనికితోడు పోలీసులను గుప్పెట పెట్టుకొని నియోజకవర్గ ప్రజలపై అక్రమ కేసులు బనాయించారని, బెదిరింపులకు, హింసకు గురిచేశారనే విమర్శలు ఉన్నాయి. కరోనా కష్టకాలంలో ప్రజల పేరు చెప్పి దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై 8 కేసులు ఉన్నాయి. అన్నీ ఆర్థిక నేరాలకు సంబంధించినవే. కేరళ జాతీయ రహదారి టోల్‌గేట్ వసూళ్లలో అవినీతికి పాల్పడ్డారని సీబీఐ కేసు నమోదు చేసింది. అలాగే ఆర్థిక అంశాలకు సంబంధించి కేరళ, ఉత్తరప్రదేశ్ లలోనూ విక్రమ్‌పై కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.
- ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై ఆర్థిక లావాదేవీలకు సంబంధించి 5 కేసులు ఉన్నాయి.
- ఇక ఐదేళ్ల పాలన విషయానికి వస్తే ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేకపోయారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించక యువతను నిర్వీర్యం చేశారు. నామ మాత్రపు అభివృద్ధి కూడా చేయలేక చేతులెత్తేశారు.
- అదే సమయంలో అటు ప్రతిపక్షాల మీద, ఇటు అమాయక ప్రజల మీద, ఇటు సహజ వనరుల మీద నిరంతర దాడి కొనసాగిందనే వాదన ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టారు. ప్రజలందరి ఆస్తి అయిన ఇసుకను దోచేశారు. పిడికెడు మట్టి దొరకనివ్వకుండా కొండలను, గుట్టలను, చెరువులను కబళించి వేశారు. క్వారీ గనులను, సిలికా మైన్లపై దురాక్రమణ చేసి స్వాధీనం చేసుకున్నారు. వందల కోట్ల సహజ వనరులను నిర్భీతిగా, నిరాటంకంగా కొల్ల గొట్టారు. అక్రమ మద్యం అమ్మకాలతో లక్షలు గడించారు. ఊరూరా గంజాయి విక్రయాలకు ఆస్కారం కలిగించారు. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా వీరికి మామూళ్లు చెల్లించని పరిస్థితి సృష్టించారు. ప్రజలపైకి పోలీసులను ఉసిగొలిపి అక్రమ కేసులు పెట్టించారు. స్వేచ్ఛగా హాయిగా జీవనం సాగించాల్సిన ప్రజలను ఐదేళ్ల పాటు భయం భయంగా బతికే వాతావరణం సృష్టించారనే అభియోగాలు వైసీపీ ఎదుర్కొం టోంది. ఇలాంటి పార్టీకి, నాయకులకు మరో చాన్స్ ఎందుకివ్వాలనే చర్చ జనంలో జోరుగా సాగుతోంది.
- గత మూడు రోజుల వ్యవధిలోనే ప్రజల ట్రెండ్ బట్టబయలవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడని నైజం, అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చూసే దృక్పథం, రౌడీయిజం, పోలీస్ జులుంకు ఆస్కారమివ్వని అధినాయ కత్వం, టీడీపీ అధినేత చంద్రబాబు పాలనాదక్షతపై విశ్వాసం, జనసేనాని పవన్ కల్యాణ్ నిజాయితీపై నమ్మకం, మోదీ నాయకత్వ బలం మీద నమ్మ కాలపై ప్రజల విశ్వాసం పెరుగుతూ ఉంది. కూటమి గ్రాఫ్ గణనీయంగా పెరుగుతున్నట్లు కనబడుతోంది.

- కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మీద నమోదైన కేసులు ఐదే అయినా ఆయన చేయించినట్లుగా ప్రజలు భావిస్తున్న నేరాలు చాలానే ఉన్నాయి. అఫిడ విట్ ప్రకారం 2014 ఎన్నికల్లో కల్తీ మద్యం సరఫరా చేసిన కేసులో ఈయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులు ప్రస్తుతం సీఐడీ విచారణలో ఉన్నాయి. ఇక కావలిలో ప్రతి పనికి మామూళ్లు తీసుకున్న నాయకుడిగా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, మట్టి, ఇసుక తోలుకుని బతికే సన్న, చిన్న ట్రాన్స్‌పోర్టర్ల పొట్ట కొట్టారని, పేదల ఇళ్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, పోలీసులను ఉసిగొల్పి వ్యాపారులను వేధించారని, పలువురి ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



మీకు ఓటెందుకెయ్యాలి?

తానో రాజకుమారునిగా భావించే ఆయనలో ప్రజానాయకునికి ఉండాల్సిన కనీస లక్షణాలు మచ్చుకైనా కనిపించవు. సామాన్య ప్రజలను కలవడానికే మాత్రం ఇష్టపడరు. పార్టీ నాయకులకూ ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం కష్టమే. ముఖ్య అనుచరులకూ ముందస్తు అనుమతి ఉండాల్సిందే. నియోజకవర్గంలో తిరగడమూ అరుదే. నియోజకవర్గ కేంద్రంలో ఇల్లున్నా వాకాడులోని ఆ నేత ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళాల్సిందే. ఆయనే నేదురుమల్లి రామ్‌కుమార్. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి దంపతుల రాజకీయ వారసుడుగా వెంకటగిరి రాజకీయాల్లోకి వచ్చిన ఈయన 16నెలల క్రితం అధికార వైసీపీకి నియోజకవర్గ ఇన్‌చార్జి. ఈ స్వల్పకాలంలోనే ప్రజలకు తన నిజ స్వరూపాన్ని చూపించారు. అసంఖ్యాకంగా అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నారు. ప్రత్యర్థిపార్టీవారినే కాదు వేధింపుల్లో తనకు అందరూ సమానమేనని తన అహంకార వైఖరిని చాటుకున్నారు. ఈయనతో పడలేక ఇప్పటికే స్వపక్షంలో పలువురు పార్టీ నుంచి జారుకున్నారు. ఇన్‌చార్జిగానే ప్రతాపం చాటుకున్న రామ్‌కుమార్ ఈసారి వైసీపీ పక్షాన బరిలో నిలబడటంతో ఈయన్ను ఎందుకు ఎన్నుకోవాలనే చర్చ జనంలో నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆయన్ని కలవడం అంత ఈజీ కాదు

రామ్‌కుమార్ ఎక్కువ రోజులు హైదరాబాదులోనే ఉంటారు. ఇక్కడకు వచ్చినా నెల్లూరు లేదా వాకాడులో గడుపుతారని జనం చెబుతున్నారు. వెంకటగిరిలో సొంతిల్లున్నా పగలు మాత్రమే ఉండి సాయంత్రానికి వాకాడు వెళ్ళిపోతారు. నియోజకవర్గ కేంద్రంలో ఒక్క రోజూ ఉన్న దాఖలా లేదు. పనులుండి కలవాలనుకుంటే పొరుగు నియోజకవర్గంలోని గూడూరు వెళ్ళాల్సిందే. అక్కడ కూడా ఆయన దర్శనం దొరకడం అంత సులువేమీ కాదు.

...గెలిస్తే ఇంకేమన్నా ఉందా?

వెంకటగిరి వైసీపీ అభ్యర్థి రాంకుమార్‌పై జనంలో చర్చ

- సామాన్య జనానికి ఆమడ దూరం
- పార్టీ వర్గాలకూ అపాయింట్‌మెంట్ కష్టమే
- ఇన్‌చార్జి హోదాలోనే అవినీతికి దాసోహం
- స్వపక్షీయులనూ వేధించిన చరిత్ర సొంతం
- ప్రజా సమస్యలన్నీ పెడచెవినే

వెంకటగిరి ప్రజలకు చెవిలో పూలు

హామీ: పెండింగులో ఉన్న అల్తూరుపాడు రిజర్వాయర్ పూర్తి చేస్తాం.
అమలు : ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా ఒక్క అడుగూ ముందుకు వేయించలేదు. ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి.

హామీ: వెంకటగిరిలో ఘోషా ఆస్పత్రి (ప్రసూతి ఆస్పత్రి)ని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం.
అమలు : భవనం శిధిలావస్థకు చేరి పదేళ్ళుగా మూతపడింది. ఆస్పత్రిని మరోచోటికి తరలించారు. కొత్త భవనాలు నిర్మించలేదు. ఆస్పత్రి స్థాయినీ పెంచలేదు.

హామీ: ఎస్‌ఎస్ కెనాల్ పూర్తి చేసి రైతులకు మేలు జరిగేలా భూములకు సాగునీరందిస్తాం.
అమలు : గత టీడీపీ ప్రభుత్వం రూ.400 కోట్లు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వమొచ్చాక పనులు ఆగిపోయాయి. ఐదేళ్ళలో ఈ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేకపోయారు.

ఇన్‌చార్జి హోదాలోనే అవినీతికి ద్వారం

అవినీతికి పాల్పడాలంటే ఎమ్మెల్యేనే కానక్కరలేదని, 16 నెలల అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాలు అని నిరూపించారు రామ్‌కుమార్. పార్టీకి సారథ్యం వహించిన కొద్దికాలంలోనే ఈయనపై అసంఖ్యాక అవినీతి ఆరోపణలు, విమర్శలు ప్రచారంలోకి వచ్చాయి. సామాన్యులు, రాజకీయ ప్రత్యర్థులే కాదు స్వపక్షీయుల నుంచీ ఈ ఆరోపణలు రావడం గమనార్హం. మచ్చుకు కొన్ని...

- సైదాపురంలో లైసెన్సు కలిగిన తెల్ల క్వార్ట్జ్ క్వారీలు 30 వరకూ ఉన్నాయి. వైసీపీ ముఖ్యనేత అండతో వందకు పైగా క్వారీలు అనధికారికంగా నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి.
- తెల్ల క్వార్ట్జ్ క్వారీల నుంచీ ముఖ్యనేతలకు భారీగా మామూళ్ళు అందుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.
- ముఖ్యనేత వాటాల కోసమే చెక్‌పోస్టుల్లో క్వార్ట్జ్ టన్నుకు రూ.8 వేలు అదనంగా వసూలు చేస్తున్నారనుకుంటున్నారు.
- ఎన్నికల ఖర్చు సాకుతో తాజాగా క్వార్ట్జ్ క్వారీల యాజమాన్యాల నుంచీ భారీగా ఫండ్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.
- రామ్‌కుమార్ అండతో అనుచరులు అవినీతి కార్యకలాపాల్లో చెలరేగిపోతున్నారు.
- ఆయన అనుచరులుగా చెలామణీ అవుతున్న ఛోటా నేతలు వెంకటగిరిలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు.
- వెంకటగిరిలో ఇద్దరు ఛోటా నేతలు జగనన్న లేఅవుట్లో బినామీ పేర్లతో స్థలాలు కాజేసి ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఆ క్రమంలో నకిలీ పట్టాలు సృష్టించారు. ఆలస్యంగా తెలుసుకున్న అధికారులు ఆ స్థలాల్లో నిర్మాణాలను కూల్చివేయగా బాధితులు లబోదిబోమన్నారు.
- గతేడాది రామ్‌కుమార్ అనుచరుడు జగనన్న లేఅవుట్‌కు పక్కనే ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు వేసి అధిక ధరలకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నాడు.
- పోలీస్ స్టేషన్‌లో సెటిల్‌మెంట్లు చేయడం, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను కబ్జా చేయడం, పైరవీలకు పాల్పడడం వంటి పనులు చేసే ఓ న్యాయవాదికి రామ్‌కుమార్ అండదండలు అందిస్తున్నారని పార్టీ నేతలే చెబుతున్నారు. ఈ కారణంగానే పలువురు ఈయనకు దూరమయ్యారంటున్నారు.
- కండలేరు రిజర్వాయరులో అనుమతులు లేకుండానే ముఖ్యనేత అండతో ఓ పార్టీ నేత రూ.3 కోట్లకు పైగా విలువ చేసే చేపలు పట్టి విక్రయించి సొమ్ము చేసుకున్నారే ప్రచారం వుంది.

ప్రధాన సమస్యలూ పట్టవా...

16 నెలల పాటు నియోజకవర్గ అధికార పార్టీ ఇన్‌చార్జిగా, బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఛైర్మన్(క్యాబినెట్ హోదా)గా కొనసాగుతున్న రామ్‌కుమార్ ప్రధాన సమస్యలను విస్మరించారు.

- వెంకటగిరి రైతాంగానికి మేలుచేసే ఆల్తూరుపాడు రిజర్వాయర్, సోమశిల-స్వర్ణముఖి కాలువల నిర్మాణం, అసంపూర్తిగా వున్న తెలుగు గంగ బ్రాంచి కాలువల నిర్మాణం, వెంకటగిరి-గూడూరు ప్రధాన రహదారి అభివృద్ధి వంటి సమస్యలను పట్టించుకోలేదు.
- వెంకటగిరిలో పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింపజేసినా నిర్వహణకు ఒక్క రూపాయి కూడా అదనంగా మంజూరు చేయించలేకపోయారు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు కూడా సమర్పించలేకపోయారు.

ప్రత్యర్థులపై వేధింపులూ ఎక్కువే!

- రాజకీయ ప్రత్యర్థులను వేధించడంలో, కేసులు పెట్టి సతాయించడంలో రామ్‌కుమార్ కొద్దికాలంలోనే ఆరితేరారు.
- ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సస్పెన్షనుకు రామ్‌కుమార్ రెడ్డే కారణమని వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కలిమిలి వర్గాన్ని టార్గెట్ చేసి వేధించారన్న ఆరోపణలున్నాయి.
- తన మద్దతుదారులకు ఎలాంటి పనులు జరగకుండా రామ్‌కుమార్ అడ్డుకున్నారని రాంప్రసాద్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.
- టీడీపీ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణతో సహా పలువురిపై పలు సందర్భాల్లో నమోదైన క్రిమినల్ కేసుల వెనుక రామ్‌కుమార్ ప్రమేయముందన్న ప్రత్యర్థులంటున్నారు.

‘ఎన్డీఏ’ రోడ్ షో సక్సెస్

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారపర్వం తుది అంకానికి చేరుకోవడంతో శనివారం ఎన్డీఏ కూటమి నేతలు తిరుపతిలో చేపట్టిన రోడ్‌షో విజయవంతమైంది. జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి ర్యాలీగా సాగిన రోడ్‌షో నాలుక్కాళ్ల మండపం వరకు చేరుకుంది. అక్కడ ప్రజలనుద్దేశించి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ తిరుపతిలో మీ ఉత్సాహం, ఆనందం చూస్తుంటే ఎన్డీఏ కూటమి విజయం తథ్యమనిపిస్తోందని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక నగరమైన తిరుపతి అభివృద్ధిపై నరేంద్ర మోదీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఐటీ సెంటర్‌గా మార్చుతామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తిరుపతి మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ దొడ్డారెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి బీజేపీలో చేరారు. నడ్డా సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, బీజేపీ నేతలు బానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, డాక్టర్ శ్రీహరిరావు, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.



యువగళంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతా

రాయలసీమకు నీరిస్తే బంగారం పండిస్తారు. దివంగత నేత ఎన్టీఆర్ తెలుగుగంగ ద్వారా నీరు పారించి బంగారు పండించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా, నేను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు అనేక ఐటీ కంపెనీలు తిరుపతికి తీసుకొచ్చాం. ఇదే తిరుపతి కేంద్రంగా 50వేల మంది ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. 2019లో రాయలసీమ బిడ్డ అంటూ వచ్చిన జగన్ రెడ్డి సర్వ నాశనం చేశారు. అమరరాజ వంటి కంపెనీలను ఇబ్బంది పెట్టి కొత్త ప్రాజెక్టును తెలంగాణకు పంపించేశారు. భూమన కుటుంబానికి కమీషన్ ఇస్తే కానీ ఏ పని జరగని పరిస్థితి. పెద్ద దొంగ కన్నా చిన్నదొంగ ముదురు అన్నట్టు.. తిరుపతిలో చిన్నదొంగకు అధికారమిస్తే తిరుపతి, తిరుమలను అమ్మేస్తాడు. ఎన్డీఏ పొత్తుకు పవనన్న బీజం వేశారు. యువగళంలో ఇక్కడే తిరిగాను, నేను ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే బాధ్యత నాది. వైసీపీ వారు డబ్బులిస్తే తీసుకోండి.. అది మనదే. కానీ మన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించండి.

- నారా లోకేశ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి

ఓట్లేసేందుకు సొంతూళ్లకు పయనం




బస్సు రావడంతో ప్రయాణికుల పరుగులు - బస్టాండ్ ఆవరణలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

సూళ్లూరుపేట, మే 11: సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు సొంతూళ్లకు పయనమయ్యారు. ఈనెల 13న సోమవారం సార్వత్రిక ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తన అభిమాన నాయకుడికి ఓటు వేసేందుకు ఇక్కడ నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. ఆదివారంతో పాటు ఎన్నికలు జరిగే రోజు సోమవారం కూడా సెలువు ఇవ్వడంతో యువత ఓటు వేసేందుకు బయలుదేరింది. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో మధ్యాహ్నం నుంచి యువతి, యువకులు బ్యాగులు చేత పట్టుకుని కనిపించారు. దీంతో బస్టాండు ఆవరణ జనాలతో కిక్కిరించింది. తిరుపతి మార్గంలో బస్సులు లేక 3 గంటల పైబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఏ బస్సు చూసిన ఓటు వేయడానికి వెళ్తున్న వారితో కిటకిటలాడాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

లూజు బస్తా నిమ్మ ధర రూ.10,400

ఈ ఏడాది గరిష్ఠంగా కిలో రూ.130



గూడూరు అర్బన్, మే 11: గూడూరు నిమ్మ మార్కెట్‌లో శనివారం లూజు బస్తా నిమ్మధర రూ.10,400 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కిలో నిమ్మకాయలు గరిష్ఠంగా రూ. 122 పలికాయి. శనివారం కిలో నాణ్యతను బట్టి రూ.80 నుంచి రూ.130 పలకడంతో రైతులకు కాసులపంట పండింది. ఈ ఏడాదిలో గరిష్ఠ ధర పలికింది. వేసవితాపం ఉధృతంగా ఉండడంతోపాటూ ఉత్తరభారత ప్రాంతాల్లో డిమాండ్ పెరగడంతో నిమ్మకాయల ధరలకు రెక్కలు వచ్చాయని వ్యాపారులు అంటున్నారు. 50 కిలోల టిక్కీ బస్తా రూ.6,500 కాగా, లూజు 80 కిలోలబస్తా రూ.10,400 పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి నిమ్మమార్కెట్‌కు మూడు రోజులు సెలవు ప్రకటించడంతో ఆదివారం నిమ్మధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

పోలింగ్ ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తాం

వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారంటూ టీడీపీ కార్యకర్త ఫిర్యాదు



ఎస్ఐ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, మే 11: వైసీపీ నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని వారి నుంచి రక్షణ కల్పించాలని చిల్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సన్నాడి వేణురెడ్డి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. చిల్లకూరులో రోడ్డు పక్కనే ఉన్న తన దుకాణంలో ఉండగా ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అనుచరులు పి.మురళి, చెంచయ్య, వంశీకృష్ణ, ఎన్.శ్రీనివాసులు తనపై దాడి చేశారన్నారు. టీడీపీ పోలింగ్ ఏజెంట్‌గా కూర్చుంటే చంపుతామని బెదిరించా రన్నారు. కామిరెడ్డి తన శవాన్ని తీసుకురమ్మన్నారని తనపై పిడి గుద్దులు కురిపించారన్నారు. తాను భయపడి ఇంటికి పారిపోగా ఆ నలుగురు అక్కడికి వచ్చి దాడి చేశారన్నారు. వైసీపీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఎస్ఐ శ్రీకాంత్‌కు వినతిపత్రం సమర్పించాడు. విషయం తెలుసుకున్న వెంటనే వేణురెడ్డికి మద్దతుగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు, సంచి కృష్ణయ్య, నాగేంద్ర ప్రసాత రెడ్డి, పి.రాజారెడ్డి, ప్రసాద్‌నాయుడు, కృష్ణారెడ్డి తదితరులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

ఎన్నికల అనంతరం జైలుకు జగన్ : చింతామోహన్



గూడూరు పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న చింతామోహన్

సూళ్లూరుపేట/ గూడురు అర్బన్, మే 11: ఎన్నికల అనంతరం సీఎం జగన్ జైలుకు పోవడం తథ్యమని తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి చందనమూడి శివతో కలిసి సూళ్లూరుపేట పట్టణంలోని బాహూజీ, కచ్చేరివీధిలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చేవన్నారు. రాష్ట్రంలో వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో సీఎంకు చెడ్డీ తడిచిపోయి ఏమి చేయాలో పాలుపోవడం లేదన్నారు. జగన్‌పై ఉన్న కేసులే కాకుండా వివేక హత్య కేసులో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు తెలుస్తుందన్నారు. కేంద్రంలో మోదీ హయాంలో దేశం బాగా వెనుకబడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ప్రత్యేక హోదా పైనే పెడతామని కడపలో జరిగిన సభలో రాహుల్ చెప్పారన్నారు. రాజేంద్ర, చిరంజీవి, కన్నబాకం హరికృష్ణ పాల్గొన్నారు.గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఎన్నికల ప్రచారంలో చింతామోహన్ మాట్లాడుతూ... కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే దుగరాజపట్నం ఓడరేవు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

షాపుల వద్ద ఫుల్... మద్యం నిల్



వెంకటగిరిటౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని అన్ని మద్యం దుకాణాలు మద్యంప్రియులతో కిటకిటలాడాయి. ఉదయం 11 గంటలకు మద్యం దుకాణాలు తెరవడంతో మందుబాబులు క్యూలో నిల్చుని మద్యం కొనుగోలు చేశారు. రెండు రోజులుగా ఎలక్షన్ సందర్భంగా పలు పార్టీలు పంచిన డబ్బులు ఉండడంతో మందుబాబులు పండగ చేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం 5గంటల నుంచి మద్యం దుకాణాలు మూతపడనుండడంతో ముందుస్తు జాగ్రత్తతో అదనపు బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్ని మద్యం దుకాణల్లో మద్యం అయిపోయింది.

చివరి రోజు జోరుగా టీడీపీ ప్రచారం



పెళ్లకూరులో ప్రచారం

చిట్టమూరు, మే 11: మండల కేంద్రంలో టీడీపీ ప్రచారంలో భాగంగా శనివారం ఆ పార్టీ నేతలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల మీదుగా కొత్తగుంట వరకు సాగింది. గూడూరు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్‌ను, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలని నినాదాలు చేశారు. అనంతరం కొత్తగుంట కూడలిలో కిషోర్‌నాయుడు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు పెచ్చరిల్లాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాబునాయుడు, బషీర్, సురేష్, సుధ తదితరులు పర్యవేక్షించారు.

కోట: మండలంలోని జరుగుమల్లిలో బీసీ కాలనీ నుంచి దళితవాడ మీదుగా గిరిజన కాలనీ వరకు టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్‌ను, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావును గెలిపించాలని అభ్యర్థించారు. రవీంద్రనాథరెడ్డి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి , గ్రామకమిటీ అధ్యక్షు లు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు, రాజుపాళెంలలో టీడీపీ యువ నాయకుడు వి.కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచు జి.పెంచలయ్య కె.సునీల్, సిసింద్రి, కృష్ణయ్య, సుమాను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

సూళ్లూరుపేట/ వాకాడు/ కోట, మే 11: సూళ్లూరుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికలక సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూనియర్ కళాశాల మైదానంలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది ఈవీఎంలతో పాటు సామగ్రిని తీసుకున్న అనంతరం సాయంత్రం 5 గంటల్లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆర్వో తెలిపారు. ఏఈఆర్వోలు, డీటీలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాకాడు మండలంలో 36 పోలింగ్ కేంద్రాలకు గాను 20 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు నరసింహరావు చెప్పారు. పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల ప్రచారాలపై ఆంక్షలు విధించినట్లు కోట తహసీల్దారు నాగరాజారావు తెలిపారు. ఎలక్ట్రానిక్, సోషల్ సహా ఇతర మీడియాలో ఎగ్జిట్‌పోల్, ఒపినియన్ పోల్స్ ప్రచారం చేయరాదని ఎంపీడీవో శంకరయ్య తెలిపారు.

ముగిసిన ప్రచార పర్వం

గూడూరు అర్బన్/ వెంకటగిరి టౌన్, మే 11: ఎన్నికల ప్రచారానికి శనివారం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్ గత నెల 25వ తేదీ నుంచి నామినేషన్ల పర్వాన్ని ప్రారంభించి 29న ఉపసంహరణ ఘట్టంతో ముగిసింది. అప్పటి నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. వివిధ వాహనాల ద్వారా తమ పార్టీని గెలిపించాలని మైక్‌లలో ఊదరగొట్టారు. శనివారం సాయంత్రం 6గంటలకు ప్రచారాలకు అనుమతి ముగియడంతో మైక్‌లు మూగబోయాయి.

వైసీపీ పనైపోయింది

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు




మాట్లాడుతున్న వరప్రసాద రావు - వాకింగ్ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 11: వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ పనైపోయిందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శనివారం టెంపుల్ టవర్ కాలనీలో వాకింగ్ చేస్తూ స్థానికులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగి ఎన్నికల ప్రచారసభలో వరప్రసాద రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డ వైసీపీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కేంద్ర పథకాలకు తమ బొమ్మలు వేసుకొని తామే ఇస్తున్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గనులను లూటీ చేశారని అడ్డువచ్చిన వారిపై కేసులు నమోదు చేసి జైలుపాలు చేశారని అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయలు దోచుకున్నారని ఇంతటి దౌర్జన్యకర ప్రభుత్వాన్ని ఈ రాష్ట్ర ప్రజలు ఎవరూ ఇంత వరకు చూడలేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థిగా తనకు, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు శనివారం ఉదయం టెంపుల్‌టవర్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలంటూ కోరారు.

అరాచక పాలనకు అంతం పలుకుదాం...

ఓజిలిలో భారీ ర్యాలీ ● కురుగొండ వరకు పసుపు మయం ● ఈశాన్యం సెంటిమెంటుతో కురుగొండలో ముగింపు




ప్రచార వాహనం ముందు మద్దతుగా పార్టీ నేతలు - ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి విజయశ్రీ

ఓజిలి, మే 11: ఎన్నికల ప్రచారానికి శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా ముగింపు పలికారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఓజిలి మండలం కురుగొండలో ఈశాన్యం సెంటిమెంటుతో ప్రచారానికి తెరదించారు. నేతలకు సాదరంగా ఆహ్వానం పలుకుతూ ఓజిలి సరిహద్దునుంచి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసారత్నం, సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం యావత్తూ కూటమి విజయాన్ని ఆకాంక్షిస్తూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటోందన్నారు. ఈ విజయంతో కౌరవ సభను చంద్రబాబు గౌరవ సభగా మార్చి ప్రజల ఆకాంక్షలకు పట్టం కట్టనున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ ంతో రాష్ట్రాన్ని తిరిగి చంద్రబాబు గాడిలోపెట్టనున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓజిలిలోని అన్ని ప్రధాన వీధులు, కాలనీలలో విస్తృతంగా పర్యటించి ఆయా కూడళ్లలో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొనడంతో నేతల్లో మరింత ధీమా కల్గింది. మండలంలోని బత్తలాపురం, మానమాల, కురుగొండ గ్రామాల్లో కూడా ప్రచారం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఓజిలి మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, గున్నం సేవాట్రస్ట్ అధినేత గున్నం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎ.ధనుంజయరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కె.సత్యవరప్రసాద రావు, పి.వెంకటసుబ్బయ్య, ఖలీల్, కమలాకర్, మన్మథరావు, సతీష్, మహిళా నాయకురాళ్లు వల్లూరు శైలజ, డి.పవిత్రారెడ్డి పాల్గొన్నారు.

విజయశ్రీని గెలిపించుకుందాం



ప్రచారంలో విజయభాస్కర్‌రెడ్డి, సోమిశెట్టి, సుధీర్ తదితరులు

నాయుడుపేట: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉండేవని ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో టీడీపీ వాణిజ్య రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు, పి.రాజశేఖర్‌రెడ్డి, సురేంద్ర, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, గంగాప్రసాద్, అవధానం సుధీర్‌తో కలసి ప్రధాన వీధుల్లో ప్రచారం చేపట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని, తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వరప్రసాద రావును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. శేషం మునిగోపి, గాలి రాజేష్‌నాయుడు, లోకనాథం, శ్రీనివాసులు, ధనంజయ, మస్తాన్, మునిరాజ, చైతన్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడిని... గెలిపిస్తే వెంకటగిరి చరిత్రను తిరగ రాస్తా: కురుగొండ్ల




సైదాపురం ర్యాలీలో చైతన్య రథం నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ - ర్యాలీకి హాజరైన జనసందోహం

వెంకటగిరి, డక్కిలి, మే 11 : తాను స్థానికుడని పిలిస్తే పలికే మీ ఇంటి పెద్ద బిడ్డను అని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం సైదాపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... వెంకటగిరి ప్రజల ఓట్లు తనకే వేస్తారన్న నమ్మకం ఉందన్నారు. కైవల్యానదిపై వంతెన నిర్మాణం చేపట్టి ప్రజల కష్టాలు తీర్చానన్నారు. ఇక తనను కలవాలంటే ఏవరి సిఫార్సు అవసరం లేదన్నారు. అపరాత్రైన తన తలుపు తట్టవచ్చన్నారు. గెలిపిస్తే వెంకటగిరి చరిత్రను తిరగరాస్తానని చెప్పారు. స్థానికేతురుడైన రాంకుమార్‌ను గెలిపిస్తే... ఒకవేళ ఆయన్ను కలవాలంటే మొదట గ్రామస్థాయి నాయకుడిని తరువాత మండల స్థాయి నాయకుడిని ఆతర్వాత ఆయన పీఏను... ఇలా చెప్పుకుంటే పెద్దజాబితానే ఉందన్నారు. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యేగా ఎదిగాన్నారు.. ప్రజలతో మమేకం కానీ వారు అసలు నాయకులు ఏలా అవుతారని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయని, సాగునీటి ప్రాజెక్టులు ఆగిపోయాయన్నారు. సైదాపురంలో ఖనిజ సంపద దోచుకున్నారని, ఆ డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. జి.నాగేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, కట్టా మోహన్ కృష్ణారెడ్డి, కృష్ణంరాజు, నోటి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలను లక్షాధికారులను చేస్తా: లక్ష్మీ సాయిప్రియ



టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నేత కార్మికులను లక్షాధికారులను చేసే బాధ్యతను తాను తీసుకుంటానని కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ చెప్పారు. మగ్గాలు నేసే కార్మిక కుటుంబాలకు ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తన తండ్రిని గెలిపిస్తే చేనేతల శ్రమను దోచుకుంటున్న దళారీ వ్యవస్థను రూపుమాపుతామని చెప్పారు. నేతన్నలు నేచిన చీరలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తానన్నారు. ఇక్కడి కార్మికులు నేసిన చీరలను అంతర్జాతీయ, విదేశాల్లో జరిగే ఎగ్జిబిషన్ స్టాళ్లలో వెంకటగిరి చీరలు ప్రదర్శించే బాధ్యతను తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతే కాకుండా వెంకటగిరి చీరలను పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌ల్లో మాల్స్ యజమానులతో మాట్లాడి కార్మికులే నేరుగా షాపింగ్ మాల్స్‌కు మార్కెటింగ్ చేసుకొనే విదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక నియోజవర్గంలో చదువున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. యువత వ్యవసాయం వైపు అడుగులు వేస్తే బీడుగా వున్న వేల ఎకరాల భూములను వారి తల్లిదండ్రులు పేరున అర్హతను బట్టి పట్టాలు ఇప్పిస్తామని చెప్పారు. రూ.లక్షలు జీతం తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా వ్యవసాయ రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. సేంద్రియ ఆధునాతన పద్ధతుల ద్వారా పంటలు పండించి వెంకటగిరి యువత దేశానికి ఆదర్శవంతంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. మహిళలకు డ్వాక్రా రుణాలు పొందడంలో బ్యాంకు నుంచి వేధింపులు లేకుండా చేస్తామన్నారు.

పేదవాడికి, పెత్తందారుకి మధ్య జరుగుతున్న ఎన్నికలివి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ - ప్రచారం నిర్వహిస్తున్న జశ్వంత్‌కుమార్

గూడూరు, మే 11: పేదవాడినైన తనకు డబ్బులున్న వైసీపీ పెత్తందార్లకు జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి తనకు ఓటువేసి గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అభ్యర్థించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పుడులేని విధంగా వైసీపీ నాయకులు అక్రమ సంపాదనను ఓటర్లకు వెదజల్లారన్నారు. ఇసుక, సిలికా, గ్రావెల్, క్వార్ట్జ్ వంటి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన అవినీతి సొమ్మును పంచి పెట్టారన్నారు. సహజ సంపదను దోచుకుని వారు పంచుతున్న డబ్బులు ప్రజల డబ్బులేనని గ్రహించాలన్నారు. ఒక్క ఓటుకు రూ.3వేలు నుంచి రూ. 5వేలు పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. వారు పంచే సొమ్ము మన డబ్బేకాబట్టి ఆలోచించి అభివృద్ధిని కాంక్షించే, స్థానికంగా ఉండే తనకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. ఒక్కసారి ఓటువేసి ప్రజలు మోసపోయారని ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని గుర్తించాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును పంచుతూ తమ సొంత సొమ్ములాగా ప్రజలను మోసం చేస్తున్నారని మరోసారి నమ్మి మోసపోవద్దన్నారు. ఓటు వేసేటప్పుడు అభివృద్ధిని కాంక్షించే చంద్రబాబుని, అవినీతిని ప్రోత్సహించే జగన్‌ను పోల్చుకుని ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. తన గెలుపు ప్రజల విజయంగా భావించాలన్నారు. మాజీ మంత్రి పరసారత్నం, శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, రహీం, భారతి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానికుడిని గెలిపించుకుందాం...

ఈ ఎన్నికల్లో స్థానికుడు, అందుబాటులో ఉండే టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాలని పాశిం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ కోరారు. శనివారం గాంధీనగర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రజలందరు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, సురేంద్ర, నరసరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.